**PRAMUKHANDHRA** 27th Year of Publication **We carry the news and views of Telugus**

27 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు

శ్రీ గోపేటి శ్రీరామారావు

₹.15

నవంబర్ 2021

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA





సరిగ్గా మూడు సంవత్సరాలయ్యింది , 23 నవంబర్ 2018 , కార్తీక పౌర్ణమి రోజున మమ్మల్ని అమావాస్య చీకట్లలో వదిలివెళ్ళిపోయారు. మా జీవితాలలో ఆయన పూర్తిగా నిండుకున్న పున్నమి చంద్రుడు.మరణం అనేది ప్రతి మనిషికి తప్పక పోయినా అదేవిటో నేనది ఒప్పుకోలేక పోతున్నాను. ఇంకొక్క మూడు నెలలు ఉండి వుంటే ప్రముఖాంధ్ర 25 ఏళ్ళు పూర్తి చేసుకుని ఆ రజతోత్సవాన్ని ఘనంగా జరపాలనుకున్నారు. ఆ వెలితి అలాగే వుండిపోయింది. ఏ పత్రికకోసమైతే ఆయన రేయింబవళ్ళు శ్రమించారో ఆ పత్రిక ఉత్సవం ఆయన కలగన్నది కలగానే ఉండిపోయింది. తరువాత నేను చెయ్యలేదు కాస్త నీరసించిపోయాను. ఎదిగిన కొడుకుని స్నేహితుడిలా చూడాలంటారు , అదాయన అక్షరాలాపాటించిన మహామనిషి. ఏది చేసినా నాకు చెప్పేవారు.నేను ఆయనకు చెప్పకుండా ఏ పని చేసేవాడిని కాను. ఆయన పి ఆర్ వో గాను , సినిమా పత్రికలు నడిపినా ఆయనకు సినిమా ప్రొడక్షన్ ఇష్టం లేదు , నాకా పిచ్చి. నా కోసం కొన్ని సినిమాలు నిర్మించారు అందులో చాలా వరకు నష్టపోయాం. రెండు సినిమాలు విడుదలకే నోచుకోలేదు. అంతటితో పులిస్టాప్ పెట్టేసి ప్రముఖాంధ్రను ప్రారంభించాం. దీనిలో ఏ కమర్షియల్ పోకడలు లేవు , తెలుగు... తెలుగు... తెలుగే, అంతేగాక మన సంస్కృతీ సాంప్రదాయాలు, ఆధ్యాత్మికం. ఆ ఒరవడి నచ్చి ఆయన స్నేహితులు కొంతమంది సపోర్ట్ చేసారు. అలా అలా ఆ పత్రికకు ఇప్పుడు 27 ఏళ్ళు. ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం నేను ఆ పత్రికను తీసుకుని వస్తూనే వున్నాను. 27 సంవత్సరాలు ఓ పత్రిక రావటమనేది సామాన్యమైన విషయం కాదు, అందునా ప్రస్తుతం ఈ కోవిడ్ రీత్యా ప్రకటనలు , విరాళాలు తగ్గిపోయాయి, కొందరిని నాకు ముఖతా పరిచయం లేనందువల్ల నేనడగలేదు. ప్రస్తుతం ప్రెస్‌కు కోవిడ్ రీత్యా ఇబ్బందులున్నా, మొండి పట్టుదలతో ముందుకెళుతున్నాను. ఆయన చాలా సభలలో ఈ పత్రిక నా తరువాత మా అబ్బాయి తీసుకు వస్తాడని చెప్పారు , ఆ నమ్మకాన్ని ఇంతవరకు కాపాడాను ఇక మీదటా ఆ భగవంతుని దయవల్ల కాపాడుకుంటానని అనుకుంటున్నాను.

నాన్నగారి బయోగ్రఫి నాకు తెలిసున్న విశేషాలతో రాయాలనుకుని మూడు సంవత్సరాలయ్యింది ,కాని రాయలేక పోయా , గత మూడేళ్ళుగా అనేక రకాల ఒత్తిడి వల్ల రాయలేక పోయా , కాస్త అలసట అలజడి సద్దుమణిగాక , బుర్ర కు పదును బెట్టి తప్పకుండా చేస్తాను. ఎప్పుడని చెప్పలేను కాని తప్పక రాస్తాను.

– గోటేటి వెంకటేశ్వరరావు



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబర్ 2021

సంపుటి : 27 **323** సంచిక : 11




# దేహధర్మమూ, దేశ ధర్మమూ ఒక్కటే!

**శ్వా**సను పీల్చి, విడిచే ఊపిరితిత్తులూ, నాడుల నాడించే నాడీ మండలమైన 'గుండె కుహరము'లు శరీరమునకు ముఖ్యమైననూ ఇంకనూ శరీరంలోని జ్ఞానేంద్రియాలైన రెండు కళ్ళూ, రెండు చెవులూ, ముక్కుపుటలూ, మాటలకు నోటి మధ్యగల నాలుకా, మూడు వైపులా ప్రాకారములైన ముప్ఫై రెండు పళ్ళూ ఆరోగ్యంతో ఉండగలిగితేనే శరీరము ఆరోగ్యమూ ఆరోగ్యవంతమైన శరీరుడు కాగలుగుతాడు.

ఈ శరీరాన్ని నడిపించకలిగే కాళ్ళూ, ఆహారాన్ని భుజించడానికి, విసర్జించిన మలిన ఆహారాన్ని శుభ్రపరచుకోవడానికి కుడి ఎడమ చేతులూ కావాలి.

ఇవన్నీ అన్నీ తామే చేసుకుంటూ పోతున్నాయని విర్రవీగకుండా ఉండేట్టు– ఈ చేతికీ ఆ చేతికీ, ఆ కాలి పాదానికీ ఈ కాలి పాదానికీ అయిదయిదు వేళ్లను సృష్టించాడు. అవే శరీర కార్యమంతా చేస్తున్నామని విర్రవీగకుండా ఆ వేళ్లలో కొన్ని పొట్టివిగానూ, కొన్ని పొడవుగానూ కల్పించి, మేము అగ్రశ్రేణి, మేము వెనుక శ్రేణి అంటూ విర్రవీగవద్దనీ, శరీరంలోని ప్రధాన అవయవముల్లా తలంచవద్దనీ, అగ్రశ్రేణీ, వెనుక శ్రేణీ అంటూ లేదనీ, పరస్పర తోడ్పాటు లేకపోతే ప్రాణి సంపూర్ణారోగ్యుడు కాలేడనీ, సృష్టించిన ప్రతీ అవయవమూ – పొడుగూ పొట్టీ, సన్నమూ, లావూ అర్హత, అనర్హతా అహములను పులుముకుంటూ పొంగరాదనీ, అంగం నుంచీ రక్తపుబొట్టు రాలినా, ఏ అవయవానికి రుగ్మత కల్గినా శరీరమంతా కట్టుకుని బాధపడే ప్రమాదమూ, అది తీవ్రతను చెంది, సంపూర్ణ శరీరం విసుగుబాటుతో దహనమయ్యే ప్రమాదముంది సుమా అన్నాడు సృష్టికర్త. పైగా నీకు దేహము అని పేరు పెట్టినది దహించుకుని పోయేది అని చెప్పడానికే సుమా– జాగ్రత్త– టేక్ కేర్ అన్నాడు.

శరీరంలోని వేలు వేలు అవయవాలు వేర్వేరు పేర్లతో పనిచేస్తూ ప్రవృత్తులు కల్పించినట్లే, నీకూ, మీకూ కల్పించాను, ఏదైనా అగ్ర అవయవమని కీడు తల పెట్టినా, ఉపేక్ష చేసినా, మొత్తం శరీరమే నశిస్తుందని 'బ్రహ్మ' గారు ఎదురుగా నిలబడి హెచ్చరించి ఖబడ్దార్ అనినట్లు ఓ కల గన్నాను. దేహధర్మం లాంటిదే దేశధర్మమని నేపథ్యంలో విన్నాను.



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(జూలై 2017)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# కంచి కామాక్షి

కంచి కామాక్షి తల్లిని దర్శించుకోవడానికి కేవలం మానవ సంకల్పం సరిపోదు ఆ తల్లి సంకల్పమే ప్రధానం. ఇది గొప్ప విశేషం.

సమస్త భూమండలానికి నాభి స్థానమే కాంచీపురం. మనం తల్లి గర్భంలో ఉన్నప్పుడు మన నాభినుండే తల్లి పోషిస్తుంది. అందుకే కామాక్షి తల్లిని దర్శించుకున్న వారిని కష్టం లేకుండా పోషిస్తుంది.

ప్రపంచంలో ఎక్కడా దర్శించలేని విధంగా అమ్మను ఇక్కడ. "సుగంధ కుంతలాంబ" అవతారంలో దర్శించవచ్చు. (ముత్తైదువులకు అఖండ సౌభాగ్యం లభిస్తుంది.)

ప్రపంచంలో ఎక్కడా దర్శించలేని విధంగా ఇక్కడ "ఢంకా వినాయకుడు" దర్శనమిస్తాడు. (ఏకాంబరేశ్వర, సుగంధ కుంతలాంబ కళ్యాణ మహోత్సవాన్ని ఢంకా భజాయింపుతో అందరికీ తెలియజేస్తాడు)

కామాక్షి తల్లి ఆలయంలో "అరూప లక్ష్మి" దేవి దర్శనమిస్తుంది. కామాక్షితల్లిని అర్చించిన తరువాత పూజారి మనకిచ్చిన కుంకుమ ప్రసాదాన్ని 'అరూప లక్ష్మి' తల్లికి ఇచ్చి దాన్నే ప్రసాదంగా తీసుకుంటే భర్తను నిందించిన దోషం పోతుంది, మరియు స్త్రీ పురుషులు ఎవరైనా సరే ఇక్కడ 'అరూప లక్ష్మి' తల్లిని దర్శించుకుంటే తప్పకుండా శాపవిమోచనం అవుతుంది.

కాత్యాయనీ దేవి పరమేశ్వరుణ్ణి భర్తగా పొందడానికి తపస్సు చేసిన క్షేత్రం కాంచిపురం. తపస్సులో భాగంగా శివకల్పితమైన గంగా ప్రవాహాన్ని తట్టుకొని సైకత లింగాన్ని రక్షించుకునే ప్రయత్నంలో లింగాన్ని తన ఆలింగ నంతో (కౌగిలితో) కాపాడుకుంటుంది.

అలా ఆలింగనం చేసుకున్నప్పుడు అమ్మ గాజుల మరియు కుచముల ముద్రలు ఇప్పటికీ అక్కడ శివలింగం పై అగుపిస్తాయి.

కామాక్షిదేవి ప్రధాన ఆలయానికి ప్రక్కనే ఉన్న ఉత్సవ కామాక్షి తల్లికి ఎదురుగా ఉన్న గోడలో తుండిర మహారాజు, శివుడి నంది ఎలాగో అమ్మకు అలా ఎదురుగా ఉంటాడు. (తనను నమ్మినవారికి ఎంతటి మహోన్నత స్థానాన్నైనా అనుగ్రహించగలదు కామాక్షి)

అమ్మ ధ్యానంలో, "శోకాపహంత్రీ సతాం" అనే దివ్య వాక్కు గురించి వర్ణణ ఉంది. ఎవరైతే సతతం మనః శుద్ధితో అమ్మను ధ్యానించే సత్పురుషులు ఉంటారో, అలాంటి వారి దుఃఖాన్ని పోగొట్టడానికి తల్లి ఎల్లపుడు సిద్ధంగా ఉంటుంది. తనయొక్క కరుణను కురిపించి ఆదుకుంటుంది, భుజం తట్టి నేనున్నాని ధైర్యం చెబుతుంది.

కావున భక్తులెల్లరు కామాక్షి తల్లిని దర్శించి పునీతులు కాగలరని మనవి. ఓం శ్రీ మాత్రే నమః

**లోకా సమస్తా సుఖినోభవన్తు!**

# తెలుగువారి గౌరవాన్ని భాషనూ, తెలుగువారు కాపాడుకోవాలి!

మనం తెలుగువాళ్ళం. మన భాష తెలుగు. మన భాషలో సౌజన్యం ఉన్నది. మాధుర్యమున్నది. అన్య భాషీయులు తెలుగును అమేయంగా అభిమానించిన చరిత్ర ఉన్నది. మనిషియైనవాడు మన జాతి, మన భాష అన్న మమకారం కలిగి ఉంటాడు. తెలుగు జాతి ఉనికి తెలుగు భాషాధ్యయనంలోనే ఉంది. భాషించడంలోనే ఉన్నది. ప్రవృత్తి మార్గంలో నేను తెలుగువాడిని, నా నాడిలో తెలుగు ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. లోక వ్యవహారానికి ఎన్ని భాషలనైనా నేర్వవచ్చు. మాట్లాడవచ్చు. కాని తల్లి భాషను మరిచినవాడు తల్లిని మరచినంతటి ఘాతకుడు. బంగాళీలు బంగాళీ భాషను మరువనట్టు తమిళులు తమిళ భాషను మరువనట్టు – తెలుగువాడు తెలుగు భాషను కలలోనైనా మరువరాదు. నేను, నాదియను మనసు, ధృఢ తరమైనపుడు నా భాష అను ధృఢతరమైన భావన ఎందుకు కలుగదు. తెలుగుభాష సరస్వతి వాగ్విలాసం. స్వయంభువు కాబట్టి అసూయా జనకమైన మాధుర్యం ఉట్టిపడుతూ ఉంటుంది. జాతి, భాష, దేశం అను మూడూ అన్యోన్యమైనవి. ఈ మూడు కలిస్తేనే భాషకు సంపూర్ణత కలుగు తుంది. ఇందే భిన్నత్వం కలిగినా, భాష వికృతమవుతుంది. క్రమక్రమంగా అదృశ్యమవుతుంది.

మానవజాతి అంతా ఒక్కటైనప్పటికినీ, భాషను బట్టి భావన, భావనను బట్టి జాతి ఉంటుంది. భాష లేకుండిన, ఆ జాతి లేనట్టే ఉంటుంది. ధృఢమైన జీవనాడి ప్రచులితమవుతుంది. మహోజ్వలమైన సింహ పీఠమ్మీద తెలుగు ఉన్ననాడు, తెలుగుభాష ఉంటుంది. సింహనాదంగా ప్రపంచంలో తెలుగుకు సింహస్థానం కలుగుతుంది. ఎంతగా ఎవ్వరు పీకలు పిసుక్కున్నటికినీ తెలుగుకు పిసరంత నష్టం ఉండదు. అంటే తెలుగువాడిలో ఈశ్వర నిర్దేశమైన తెలుగుకు ఢోకా ఉండదు. ●



# ఏడూ కొండలస్వామి ఎక్కడున్నావయ్యా! ఎన్ని మెట్లెక్కినా కాన రావేమయ్యా!

**నీ పాదశిఖరం ఎక్కినా, కనిపించవేమయ్యా!**

**భూలోకంలో ఉన్న వారికే కాదు, ముల్లోకములలోని వారికీ వేంకటేశ్వరుడే కొండంత దేవుడు!**

హైరాన పడుతూ ఏడుకొండల మెట్లెక్కుతూ వెళ్ళినా, కారుల్లో బస్సుల్లో సైరన్ మోతపెట్టుకుంటూ వెళ్లినా, ఆయన అత్యవసర దర్శనం యివ్వడు! కొండంత ఆ దేవునికి కొండంత పరిణామంలో పూలూ, పండ్లూ యిచ్చినా అనుగ్రహించడు.

ఏడుకొండలవాడా, యెక్కడున్నావయ్యా– అని ఆర్తితో కొలవాలి. ఏడుకొండల వాడా– యని ఎలుగెత్తి పిలవాలి. **గోవింద గోవింద** అంటూ నామస్మరణ చేయాలి. స్వరపేటిక ఆ నామస్మరణ నుంచీ రావాలి.

గోవింద గోవింద అంటూ, స్మరిస్తూ ఏడు ద్వారాలు దాటివెడితే, నామాం పట్టీలో కర్పూర కస్తూరీ తిలకం మధ్య భృగిటి నుంచీ ఆయన మనల్ని చూస్తాడు. మనం ఆయన్ను చూడడం కాదు, ఆయన మనల్ని చూడాలి. తదీర్ఘ భక్తితో గోవిందనామ తన్మయత్వంతో వెళ్ళేవారిని ఆయన తప్పక చూస్తాడు. అనుగ్రహిస్తాడు. ఇటీవలే ఓ మూగ బాలుడు తల్లీ తండ్రులతో క్యూలో వెడుతూ, గోవిందా! గోవింద గోవింద! గోవిందా– అని పలికి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇలాంటి ఒక అనుభవం నేనూ పొందాను.

1956 సం॥ము వరకూ ఆలయం క్యూలో కనురెప్పమూయకుండా, గళం యుగళంగా గోవింద గోవింద అంటూనే తృప్తిగా దర్శించే భాగ్యం కలిగింది. కళ్ళముందే ఆ కరుణాంతరంగుడు కనులు విపార్చి చూచిన అనుభూతి కలిగింది. పద పద అనే వాటంటీర్ల తోపులాట ఉండేది కాదు. తర్వాత తర్వాత భక్తుల ఆర్తిని చూచి ఆయన కనురెప్పలు తెరిచి చూచిన అనుభూతిని కల్గిస్తూ వచ్చాడు. ఏడు కొండలవాడ ఎక్కడున్నావయ్యా– ఎన్ని మెట్లెక్కి వచ్చాను కనిపించవేమయ్యా అంటూండగానే నీ ముందే ఉన్నాను– అనే భరోసా యిస్తూ, అభీష్టములను సిద్ధింపచేసే ఏడేడు లోకాల ఏడుకొండల ఱేడు సద్దర్శనమిస్తూనే ఉన్నాడు. ఆయన అవిశ్రాంత అనుగ్రహాన్ని చూచి– ఓ యమ్మ ఓ సినిమాలో– **సద్దుసేయక నీవు నిదురపోవయ్యా!**

**పాలసంద్రపుటలల పట్టె మంచముగా, పున్నమి వెన్నెలలు పూలపాన్పుగా, అన్నీ అమరించే నీ అలిమేలుమంగా – సద్దుసేయక నీవు నిదురపోవయ్యా** – అన్న పదం నాలో పదేపదే కుసుమిస్తూనే ఉంది– ఇది నిజమేమో – రాత్రి 12 గం॥లకే పవ్వళింపు సేవజరిపి, తెల్లవారక ముందే 2 గంటలకే **కౌసల్య సుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే** మేలు కొలుపు పాడి భక్తుల రద్దీని పురస్కరించుకుని మేలు కొలుపుతున్నారు. నిదుర ఎరుగని స్వామి ఆయన ఒక్కడే! భక్తుల పాలిట కల్పతరువు. ఆయన తనువు నిదురెరుగదు! కాబట్టి, ఆయన కళ్ళెప్పుడూ తెరుచుకునే ఉంటాయ్. త్యాగరాజుల వారొక పర్యాయం తిరుమల వెళ్ళినప్పుడు, స్వామిని నిదురపుచ్చి తెరవేసారు :

"తెరతీయగరావా స్వామీ, నాలోని మత్సరమను తెరతీయగారాదా – అని ఆలపించే సరికి– ఆ స్వామి తెరతీసి త్యాగరాజులవారికి దర్శనమిచ్చారు.

అలాటి స్వామి ఎక్కడున్నావయ్యా– అంటే ఏడుకొండలపైనే ఉన్నాడు. తిరుచానూరులో ఉన్న సతి పద్మావతి దేవిని ఎప్పుడు చూస్తాడనే సందేహం కలిగి, ఓ కవి – 'నడిరేయి ఏ జామునో స్వామి తిరుమల, శిఖరాలు దిగి వచ్చునో' అనే ఆర్ద్రతతో కీర్తన వ్రాసాడు:

ఏడు కొండలవాడు ఎందులేడు? ఎందెందు వెదికినా అందే ఉన్నాడంటూ సమాధానపడతాడు.

స్వామి నిన్ను సంపూర్ణంగా, తృప్తిగా దర్శనం చేసుకుని మూడు సంవత్సరా లైంది. చక్కగా ఉదయాస్తమాన సేవలో నిన్ను చూసి తరించే భాగ్యం ఈ కొరోనా వల్ల కుదరలేదు. నీ బ్రహ్మోత్సవాలు వీధులలో నిలుచుని తిలకించేవారం. ఆ భాగ్యం కలగటంలేదు. స్వామి మేము చేసిన అపరాధములు మన్నించి, మమ్ము కరుణించు స్వామి. ●



## పరమార్థ కథలు

# శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

శ్రీశుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి



# పరుల కిచ్చినదే తనకు లభించును

ఉత్తరప్రాంతమున ఒక పెద్దపట్టణమునందు లక్షాధికారి ఒకడు కలడు. అతడు పెక్కు పారిశ్రామిక సంస్థలను నిర్వహించుచుండెను. అతని ఆధిపత్యము క్రింద ఎన్నియో మిల్లులు, ఫ్యాక్టరీలు నడుచుచుండెను. ఉత్తరదేశప్రజలు గోధుమరొట్టె విశేషముగా వాడుచుందురు కావున గోధుమపిండి జనులకు చాల అవసరమని భావించి ఆ "సేటు" గారు ఒక పెద్ద పిండిమరను ఏర్పాటుచేసిరి. ప్రతిదినము జనులు తండోపతండములుగా ఆ మిల్లుయొద్దకు వచ్చి గోధుమలను పిండి చేయించు కొని వెడలుచుందురు. ఆ పిండిమరవలన సేటుగారికి ప్రతి సంవత్సరము కొన్నివేల రూపాయల వరుంబడి వచ్చుచుండెను.

ఇట్లుండ ఒకనాడు ఆ పట్టణమునందలి ఒకానొక దేవాలయము నందు ఒక హరిదాసు హరికథ చెప్పుచుండ జనులు, సేటుగారు శ్రవణాభిలాషులై అచటికి పయనమైరి. ఆ దినము ప్రహ్లాదోపాఖ్యానము హరికథ జరుగుచుండెను. జనులు భక్తి భావముతో తన్మయులై తదేకచిత్తులై వినుచుండిరి. భాగవతారుగారు తమ యావచ్ఛక్తిని వినియోగించి, పెక్కు హావభావములను మనోరంజకముగ వెల్లడించుచు కలకంఠముతో శ్రావ్యముగ గీతములను ఆలాపించుచు బహు ఆకర్షణీయముగ హరికథ చెప్పుచుండిరి. సందర్భవశమున ఆ హరికథయందు అన్నదాన ప్రసక్తి వచ్చెను. అన్నదానము మహాపుణ్యప్రదమైన కార్యమనియు, ఒక్క ప్రాణికి అన్నము పెట్టినచో ఎంతయో పుణ్యమును జీవుడు ఆర్జించగలడనియు, కావున అన్నదానము ద్వారా దరిద్రనారాయణులకు సేవచేయుట పరమధర్మమనియు ప్రబోధించెను. ఆ వాక్యమును శ్రద్ధతో నాలకించిన లక్షాధికారి తానుకూడ అట్లు దీనజనులకు అన్న దానముచేసి పుణ్యభాగ్యము నొందవచ్చునని తలంచి మరునాడు అన్నదానము చేయ నిశ్చయించుకొనెను.

ఉత్తర దేశమునందు అందరును భోజనమునందు రొట్టెలనే ఉపయోగించు దురు. కాబట్టి ఆ సేటుగారు రొట్టెల కొరకై తన పిండిమరలో నిలువ యున్న గోధుమపిండిని తెప్పించి రొట్టెలను చేయించుటకై తన అనుచరులకు ఆజ్ఞ యొసంగెను. బహుకాలము అమ్ముడు బోక నిలవయుండుటచే ఆ పిండి పురుగుపట్టి దుర్గంధమును వెడలగక్కుచుండెను. సేటుగారికి ఆ విషయము తెలిసియుండినను ఏదియో విధముగ అది విడుదల యగుటయే ప్రధానముగ భావించినవాడై దానినే రొట్టెలు చేయించి బీదవారికి పంచిపెట్టించెను. ఇక్కార్యము ద్వారా తనకు రెండు మేలులు చేకూరగలవని అతడు నిశ్చయించుకొనెను. 1). బహుకాలము నుండియు ఖర్చుకాకయున్న గోధుమపిండి ఏదియో యొక కార్యమునకు వినియోగపడుటయు, 2). బీదలకు పెట్టుటవలన పుణ్యము లభించుటయు.

గోధుమపిండి పుచ్చిపోయి యుండుటవలనను, దుర్గంధభూయిష్ఠముగ నుండుటవలనను వానితో చేయబడిన రొట్టెలు భుజించుటకు యోగ్యము కావు.

గోధుమపిండి పుచ్చిపోయి యుండుటవలనను, దుర్గంధభూయిష్టముగ నుండుట వలనను దానితో చేయబడిన రొట్టెలు భుజించుటకు యోగ్యములుగా నుండనప్పటి కిని బీదలు ఆకలిచే వాటిని ఎట్లో తినివైచి వాంతిచేసికొనుచు అతృప్తితో వెడలి పోయిరి. ఈ చిత్రమంతయు గాంచి సేటుగారి ధర్మపత్ని పరమచింతాక్రాంతురాలై తన భర్తయొద్దకు పరుగిడి "ఏమండీ! అన్నదానమువలన పుణ్యము లభించునను విషయము నిజమేకాని పాచిపోయిన అన్నము, ముక్కి పోయిన రొట్టెలు, పుచ్చి పోయిన వస్తువులు తినుటకు ఒకరికి పెట్టవచ్చునా? మనము మంచి రొట్టెలు తినుచు నారాయణస్వరూపులగు ఆ బీదవారికి ఆ దరిద్రనారాయణులకు వాసనకొట్టు చున్న ఆ పాడురొట్టెలు పెట్టవచ్చునా? భగవంతుడు మనకేమియు లోటు చేయలేదు కదా! కావలసినంత మంచి గోధుమపిండి మన మిల్లులో ఉన్నది కదా! దాని నెందుకు ఉపయోగించరాదు? హేయమై అపవిత్రమైనట్టి వస్తువును దానము చేసినందువలన పుణ్యము లభించునా?"అని అడుగగా షావుకారు ఏమియు ప్రత్యుత్తర మీయక వెడలిపోయెను.

అప్పుడు సేటుగారి భార్య భర్తకు తగిన పాఠము బోధించి అతని హృదయము నందు పరివర్తనము తెచ్చుట ఎటులా యని యోచించి బీదలకు వడ్డించిన ఆ పుచ్చిపోయిన రొట్టెలు నాలుగు తీసి దాచిపెట్టెను.

మధ్యాహ్నము 12 గం॥లు అగుసరికి భర్తగారు భోజనమునకై ఇంటికి రాగా భార్య తాను దాచిపెట్టిన ఆ చెడిపోయిన రొట్టెలనే భర్తకు వడ్డించెను, అప్పుడు సేటుగారు ఏల అట్లు చేసితివని భార్యను మందలించగా ఆమె యిట్లు బదులు చెప్పెను – 'ఏమండీ! ఈ లోకములో ఒకరు ఏ వస్తువును ఇతరులకు దానము చేసెదరో, ఏ పదార్థమును ఇతరులకు పెట్టుదురో ఆ వస్తువునే పరలోకములో కర్మదేవతలు వారికి ఒసంగెదరని పెద్దలు చెప్పుచుందురు. ఇపుడు మీరు పుచ్చిపోయిన వాసనకొట్టు రొట్టెలను ఇతరులకు పెట్టినారు కాబట్టి ఆ పాడురొట్టెలే మీకు పరలోకములో తినుటకు లభింపగలవు. కాబట్టి వాటిని తినుటకు ఇప్పటినుండియే అభ్యాసము చేసినచో అప్పటికి బాగుగా అలవాటుపడగలరు. అకస్మాత్తుగ మీరు అక్కడ తినలేరు. కనుక ఇపుడు మీకు వాటిని వడ్డించినాను. అంతియేకాని చెడు భావనతో కాదు!'

భార్యయొక్క ఆ హితవాక్యములను వినగనే భర్తకు కనువిప్పు కలిగి తాను చేసినది గొప్ప పొరపాటని గ్రహించినవాడై వెంటనే తన యనుచరులను పిలిపించి మంచి గోధుమపిండితో రొట్టెలను చేయించి బీదవారికి తిరిగి వడ్డించెను. ఆ బీదలందఱును అపుడు పరమానందపడి సంతుష్టాంతరంగులై వెడలిపోయిరి.

**నీతి:–** ఒకరికి తానేది యొసంగునో అదియే తనకు లభించును కావున అపవిత్రమైన దానిని పరుల కీయరాదు. అపవిత్ర భోజనమును ఇతరులకు పెట్టరాదు. మంచి వస్తువునే ఈయవలెను. మంచి భోజనమునే పెట్టవలెను. ఎదుటివాడు నారాయణ స్వరూపుడని భావించియే దానధర్మములు చేయవలెను. ●

**రామరాజభూషణుడు (భట్టుమూర్తి) వ్రాసిన, ఎంతో ప్రసిద్ధికెక్కిన, గమ్మత్తైన ఈ క్రింది పద్యం పరిశీలించండి.**

**నానాసూనవితానవాసనల నానందించుసారంగ మే**
**లా న న్నొల్ల దటం గంధఫలి బల్కాకం దపం బంది యో**
**షానాసాకృతిఁ దాల్చి సర్వసుమనస్సౌరభ్యసంవాసి యై**
**పూనెన్ బ్రేక్షణమాలికామధుకరీ పుంజంబు లిర్వంకలన్.**

సారంగం (తుమ్మెద) అన్ని పూలపైనా వాలి మకరందం గ్రోలుతుంది కానీ, గంధఫలి (సంపెంగ) జోలికి పోదు (తేనె లభించని కారణచేత). దానితో ఆ సంపంగి మనోవేదనకు గురైనదై తీవ్ర తపశ్చర్యకు పూనుకొందిట. సరే, బ్రహ్మగారు ప్రత్యక్షమై "నీ వాంఛితం ఏమి"టంటే "తుమ్మెద నా వైపుకే రాదు, నాకు బాధగా ఉం"దంటే, "సరే! నీ కోరిక ఇబ్బడి ముబ్బడిగా తీరుతుంది పో!" అని దానిని ఒక సొగసుగత్తె నాసిక(ముక్కు)గా మార్చశాడట. సరే! మరి దాని కోరిక ఎలా తీరిందయ్యా అంటే, అందాల భామినుల క్రీగంటి (వాలు చూపులు) తుమ్మెదల బారుగా అభివర్ణించటం ఒక కవిసమయం. ఇతర పూలపై కేవలం ఒక తుమ్మెదే వాలుతుంది. నీపైన తుమ్మెదలు బారే(వరుసే) వాలుతుంది పో! అని బ్రహ్మగారు ఓదార్చాడట! ఏతావాతా కవిగారు చెప్ప దలచుకొన్నది ఏమిటయ్యా అంటే ఆ సుందరి నాసిక సంపెంగపువ్వులా సుమనోహరంగా ఉందీ అని! దానికి ఇంత డొంక తిరుగుడు వ్యవహారం! దీనికి అనుబంధంగా మరొక చిన్నకథ. అసలు ఈ పద్యం వ్రాసింది నంది తిమ్మనగారు అనీ, ఈ పద్యం కారణంగానే ఆయనకు "ముక్కు తిమ్మన" అనే పేరొచ్చిందనీ, ఆయన వద్ద నుంచి భట్టుమూర్తిగారు కొన్నివేల వరహాలు ఇచ్చి ఈ పద్యం కొనుక్కున్నాడనీ, ప్రచారంలో ఉంది. అయితే తిమ్మనగారు స్త్రీల అంగాంగవర్ణనలు చేయటంలో దిట్ట. ఆయన ఈ పద్యం వ్రాయడం, అది భట్టుమూర్తిగారు కొనుక్కోవటం నమ్మశక్యం కాని విషయం అని దివాకర్ల వేంకటావధాని వంటి పెద్దలు/ప్రముఖులు కొట్టి పారేశారు. ఏది ఏమైనా పద్యం మాత్రం బాగా వాసికెక్కింది. ●

# తెలుగు మర్చిపోయామా?

తెలుగు భాషను మన ఇళ్లలోనే వాడటం మానేశామా? 'డోర్ లాక్ చెయ్యకండి, నేను వెళ్తున్నా డోర్ లాక్ చేస్కో', 'నా కార్ కీస్ ఎక్కడ?' ఇందులో 'కీస్' కు అచ్చ తెలుగు పదం వాడొచ్చు. కానీ మనం వాడం. ఎందుకు?

ఓ ఇరవై యేళ్ళు వెనక్కి వెళితే, తలుపు తాళం వేసుకో, గడియ పెట్టుకో అనే వాళ్ళం. ఇవేకాదు, చిన్నతనంలో విన్న, వాడిన తెలుగు మాటలు మనమే మర్చిపోతున్నాం. నిన్న మొన్నటి వరకు మనం మాట్లాడిన మాటలు మన పిల్లలకు నేర్పించాల్సింది పోయి, మనమిలా ఎందుకు మారిపోయాం? మన తెలుగులో మాటలు లేవా? ఎందుకు లేవు, భేషుగ్గా ఉన్నాయి! కానీ మనం పలకం. వంటిం టిని... కిచెన్ చేసాం. వసారా.....వరండాగా మారింది. ఇలా చావడి, పంచ, ముంగిలి, నట్టిల్లు, తలవాకిలి, నడవ, పెరడు, ఇవన్నీ మరచిపోయాం.

మన ఇళ్ళకు చుట్టాలు, బంధువులు రావడం మానేసారు. గెస్ట్‌లే వస్తారు.

ఆ వచ్చిన వాళ్ళు మనింట్లో అన్నం తినరు. ఏ లంచో, డిన్నరో చేస్తారు.

భోజనానికి కూర్చున్నాక కంచాలు పెట్టటం మానేసి ప్లేట్లు పెడుతున్నాం.

అందులో వడ్డించేవన్నీ....... రైస్, కర్రీ, గ్రేవీ, ఫ్రై, కర్డ్ వగైరాలే.

అన్నం, కూర, ఇగురు, పులుసు, వేపుడు, తినండి అంటే, ఇంకేమన్నా ఉందా, వాళ్ళేమనుకుంటారో అని భయం. అంగడి (కొట్టు) కి వెళ్ళేటప్పుడు సంచి తీసుకెళ్ళం.

బ్యాగ్ పట్టుకుని షాప్‌కు వెళ్తున్నాము. అందులో వెజిటబుల్స్, ఫ్రూట్స్ వేసుకుంటాము. కూరగాయలు, పళ్ళు కుళ్ళిపోయున్నాయి గదా మరి.

ఏమండీ మీ మనవరాలికి కానుపు అయ్యిందా అని ఆ మధ్య ఓ పెద్దావిడను అడిగా. ఏంటమ్మా డెలివరీ అయిందా అనకుండా నువ్వింకా కానుపు అంటావేంటి? అని ఎదురు ప్రశ్న వేసింది. బిత్తరపోవడం నావంతయింది.

టీ.వీ లో వచ్చే ఆరోగ్య కార్యక్రమాలు, వంటా – వార్పు కార్యక్రమాలు రోజూ చూసే వాళ్ళకు అలవోకగా ఆంగ్ల పదాలు పట్టుబడతాయి మరి.

అందుకే ఆవిడ అలా అని ఉండొచ్చు.

టీ.వీ వంటల కార్యక్రమంలో ఒకావిడ మనకు వంట ఎలా చెయ్యాలో చెబుతుంది. అది ఏ భాషో మీరే చెప్పాలి.

'కొంచెం సాల్ట్, మిర్చీ పౌడర్, ధనియా పౌడర్, జింజర్ గార్లిక్ పేస్ట్ యాడ్ చేసి ఫైవ్ మినిట్స్ కుక్ చెయ్యలి, స్టౌవ్ ఆఫ్ చేసి మసాలా పౌడర్ యాడ్ చేసి బాగా మిక్స్ చెయ్యాలి.' ఇలాసాగుతుంది.

మరి మన కూరలకు అల్లం, వెల్లుల్లి, ఉప్పూ, కారాల రుచులు ఎలా తగుల్తాయి?

నిన్న మా పక్కింటాయన వచ్చి 'మా సిస్టర్స్ సన్ ది మేరేజ్ ఉందండి, ఊరికి వెళ్తున్నాం, ఇల్లు కాస్త చూస్తుండండి' అని చెప్పి వెళ్ళాడు.

మేనల్లుడి పెళ్ళి అనడంలో ఎంత దగ్గరితనం ఉంటుంది? ఎందుకిలా ముచ్చటైన పదాల్ని వాడటానికి కూడ మనం వెనుకాడుతున్నాం?

అమ్మ, నాన్న అని పిలవడం ఎప్పుడో మానేసాం. అత్త, మామ, బాబాయ్, పిన్ని, పెద్దమ్మ, పెదనాన్న అందరూ పోయి ఆంటీ అంకుల్ మిగిలారు. ఇప్పుడు అక్క, అన్నా, బావ, మరిది, వదిన, మరదలు వగైరాలంతా దూరమై కజిన్స్ అయిపోయారు.

పిల్లల్ని బడికి పంపడం కూడ మానేసాం. స్కూల్‌కు పంపిస్తాం.

సరే బడికి వెళ్ళాక వాళ్ళకు ఎలాగూ ఇంగ్లీషు లో మాట్లాడక తప్పదు.

ఇంటి దగ్గరన్నా తెలుగు మాటలు మాట్లాడాలని అనుకోము.

మనం ఎందుకు నిన్నటి వరకు వాడిన తెలుగు మాటలను వదిలేస్తున్నాం? ఎక్కువ ఇంగ్లీషు పదాలు వాడితే మనకు సమాజంలో గౌరవం లభిస్తుంది అనుకుంటున్నామా? తెలుగు మాటలు మనకు మొరటుగా ఎందుకనిపిస్తున్నాయి? ఇది పరభాషా వ్యామోహం మాత్రమే కాదు, నాకూ ఇంగ్లీషు ముక్కలు వచ్చు, నేనేం తక్కువ కాదు అని మనకి మనం, చెప్పుకోవడం, ఇతరులు అనుకోవాలన్న భావన.

ఇలా ఆలోచిస్తాం కాబట్టే మన తెలుగు భాషకు దిక్కులు లేకుండా పోయాయి. ఇప్పుడు మాత్రం పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా అందరికీ ఇంగ్లీష్ మాటలు బాగా వంటబట్టాయి.

అలాగని వాడుకలో ఉన్నమాటలను వదిలేసి పరభాషా పదాలు వాడటం వల్ల భాష క్షీణించిపోతుంది. బయటకెళితే ఎలాగు తప్పదు అనుకున్నా, కనీసం ఇంటి గోడల నడుమైనా ఆపని చేద్దాం. అవసరం లేని ఆంగ్ల పదాలకు డోర్ లాక్ చేసి, అచ్చ తెలుగు మాటలకు తలుపులు తెరుద్దాం. ●

# తమిళ భాషలోన కవిరాజుగా ప్రసిద్ధి చెందిన కన్నదాసన్ గారు చెప్పిన మాటలు అక్షర సత్యాలు

"అర్థవంతమైన హిందూ మతము"??

– నేను హిందువుగా ఉండడానికి ఇష్టపడుటకు కారణాలు?

1. భగవంతుడు లేడని చెప్పినా, మత ద్రోహిగా పరిగణించని ధర్మం, హిందూధర్మం.
2. రోజుకు ఇన్ని సార్లు, వారానికి ఇన్ని సార్లు, నెలకు ఇన్ని సార్లు తప్పనిసరిగా గుడికి వెళ్ళే తీరాలని నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
3. జీవిత కాలంలో కాశికో లేక రామేశ్వరానికో తప్పనిసరిగా ఒక్క సారి వెళ్ళే తీరాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
4. హిందూ మత గ్రంథాల ప్రకారమే జీవనాన్ని కొనసాగించాలనే నిబంధనలు పెట్టని ధర్మం, హిందూధర్మం.
5. హిందూ మతానికి ప్రత్యేకమైన మతపెద్ద అంటూ ఎవరూ ఉండరు.
6. సన్యాసులు, స్వామీజీలు, మఠాధిపతులు తప్పులు చేసినా, నిలదీసి, ప్రశ్నించే ధర్మం, హిందూధర్మం.
7. హిందువులు ఈ క్రింది వాటిని కూడా భగవత్స్వరూపాలుగానే ఆరాధిస్తారు.
   - వృక్షాలు దైవ స్వరూపాలే.
   - రాళ్ళూ – రప్పలూ కూడా దైవస్వరూపాలే.
   - నీరు (గంగ) కూడా దైవస్వరూపమే.
   - గాలి కూడా దైవ స్వరూపమే.
   - వానరాలు (కోతులు) కూడా దైవ స్వరూపాలే.
   - కుక్కలు (భైరవుడు) కూడా దైవ స్వరూపాలే.
   - పంది (వరాహం) కూడా దైవ స్వరూపమే.
8. నువ్వూ దైవ స్వరూపమే.
   నేనూ దైవ స్వరూపమే.
   కంటికి కనిపించేవన్నీ దైవ స్వరూపాలే.
9. చతుర్వేదాలు, నాలుగు ఉప వేదాలు, రెండు ఇతిహాసాలు, పద్దెనిమిది పురాణాలు, పద్దెనిమిది ఉప పురాణాలు, ఆరు శాస్త్రాలు, పద్దెనిమిది స్మృతులతో పాటు 1200 వందలకు పైగా ధార్మిక గ్రంథాలు గల సువిశాల ధర్మం, హిందూధర్మం.

**మన ధార్మిక గ్రంథాలు మనకు బోధించే విశిష్ట ధర్మాలు.**

**కర్మల గురించి తెలియాలంటే...**

- వేదాలు చదవాలి.

**సమస్త జ్ఞానం పొందాలంటే...**

- ఉపనిషత్తులు చదవాలి.

**పర స్త్రీ వ్యామోహం పోవాలంటే...**

- రామాయణం చదవాలి.

**రాజ్యకాంక్ష, పదవీవ్యామోహం పోవాలంటే...**

- మహాభారతం చదవాలి.

**భగవంతుని తత్త్వం తెలియాలంటే...**

- భాగవతం చదవాలి.

**చక్కటి పరిపాలన అందించాలంటే...**

- కౌటిల్యుని "అర్థశాస్త్రం" చదవాలి.

**చక్కటి ఆరోగ్యానికి...**

- ఆయుర్వేదం చదవాలి. ●



# నాన్న ఎవరు?

*"ఈ నెల నాన్న గురించి రాయాలనుకున్నప్పుడు నాకీ వ్యాసం వాట్సాప్‌లో వచ్చింది, నా భావాలకు సరిపోయినందు వల్ల ఆ వ్యాసాన్ని మీకందిస్తు న్నాను, వ్యాసకర్త ఎవరో తెలియలేదు, వారికి నా కృతజ్ఞతలు."*

బ్రహ్మదేవుడు చాలా బిజీగా తల రాతలు రాసే పనిలో ఉన్నాడు. ఇంతలో నేను, భూమి మీదకు వెళ్ళను అని మారాం చేయడం మొదలుపెట్టాను.

భూమి మీద నాకు ఎవ్వరూ తెలీదు. నేను ఎలా బతకగలను? అని అడిగాను. నువ్వేం భయపడకు. నిన్ను కాచి కాపాడటానికి నా అంశగా ఒక అమ్మను తయారుచేశాను. ఆమె కడుపులో నిన్ను పుట్టిస్తా" అన్నాడు బ్రహ్మదేవుడు.

అయితే సరే, కానీ నాకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా నేను ఏడవటం మొదలుపెడతా. అప్పుడు మీరు నా ఇబ్బందిని తొలగిం చాలి" అనే షరతు పెట్టాను.

దానికి బ్రహ్మ, "సరే నీకు మాటలు రానంత వరకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులం ముగ్గురం నీకు సహాయం చేస్తాం" అన్నాడు.

మరి, ఆ తర్వాత చెయ్యరా?" అని అడిగా.

అదేం లేదులే. నీకు మాటలొచ్చాకా నీకో మహా మంత్రం చెబుతాం. నీకు ఏ కష్టం వచ్చినా, ఒక్కసారి ఆ మంత్రం పఠిస్తే తప్పకుండా నీకు సహాయం దొరుకు తుంది." అని చెప్పాడు బ్రహ్మ.

మళ్ళీ ఇంకేదో అడగబోయే లోపల ఆ పరబ్రహ్మ, తన బెడ్రూం బాల్కనీ లోంచి నన్ను కిందకి త్రోసేశాడు. ఎలా వచ్చి చేరానో తెలియదు గానీ, ఆసుపత్రి బెడ్ మీద మా అమ్మ పక్కన వచ్చిపడ్డాను.

అమ్మ పక్కన హాయిగా నిద్రపోతున్న నన్ను, ఓ పెద్దమనిషి తన చేతిలోకి తీసుకున్నాడు. భయమేసి, అమ్మ వైపు చూసి ఏడుపు ముఖం పెట్టాను. "మీ నాన్నగారు రా!" అంటూ అమ్మ తన కంటిచూపుతో ఆయన్ని పరిచయం చేసింది.

బ్రహ్మదేవుడు నాకు అమ్మ గురించి చెప్పి పంపాడు. తను అన్ని చోట్ల ఉండటం కుదరక అమ్మని సృష్టించాను అని. మరి నాన్న అంటే ఎవరు? భూమి మీద పడిన మొదటి రోజే నా బుర్రలో ఎన్నో ఆలోచనలు మొదలయ్యాయి.ఆ దేవుడినే అడిగి తెలుసుకుందామని ఏడుపు మొదలుపెట్టా.

ఇప్పుడే కదా భూమి మీద పడ్డావు. అప్పుడే నన్ను గుర్తుచేసుకున్నావేమిటి?" అని అడిగాడు. అమ్మ గురించి చెప్పారు గాని, నాన్న గురించి ఏమీ చెప్పలేదేంటని అడిగా.

"నీ జన్మకి నాంది, నీ భవితకు పునాది" అని ముక్తసరిగా బదులిచ్చి, "అర్థమైందా?" అని ప్రశ్నించాడు.

పాలు తాగే పసివాడి ప్రశ్నకి ప్రాసతో బదులిస్తే ఎలా అర్థం అవుతుంది స్వామి" అని సమాధానం చెప్పాను

ఒక అర్థం లేని చిరునవ్వు నవ్వి, "నీకూ మీ అమ్మకు కాపుగా నేను నియమించిన అంగరక్షకుడు" అని క్లుప్తంగా చెప్పాడు. అప్పుడు అర్థమైంది నా బుజ్జి బుర్రకి, నా కష్టం తీర్చేది అమ్మ అని. మాకు ఏ కష్టం రాకుండా చూసుకునే బాధ్యత నాన్నదని.

ఆ రోజు నుంచి నా చిన్ని కళ్ళు నాన్న కోసం వెతుకుతూనే ఉండేవి. ఎప్పుడో ఉద యాన్నే వెళ్ళిపోయి సాయంత్రం వచ్చేవాడు. "ఏం, నేనంటే ప్రేమ లేదా" అని ప్రశ్నించా ఆ దేవుడిని మళ్ళీ. "నీ మీద ప్రేమ ఉంది కాబట్టే, రోజు బయటికి వెళ్ళి కష్టపడి పని చేసి వస్తున్నాడు" అని బదులిచ్చాడు బ్రహ్మ. అర్థం కాలేదని చెప్పాను. కొన్నేళ్లకు నీకే అర్థం అవుతుందిలే అన్నాడు.

ఈయన అన్నీ తల తిక్క సమాధానాలే చెబుతాడులే అనుకుని, నా దగ్గరికి వచ్చిన మా నాన్న మొహం చూసా. మా నాన్న ముఖం నీరసంగా కనిపించింది. పలకరింపు కోసం ఒక చిరునవ్వు నవ్వా. మా నాన్న ముఖం లోని నీరసం మాయమైంది. నన్ను చూసిన ఆయన ముఖం పున్నమి చంద్రుడిలా మెరిసిపోసాగింది. ఆ దేవ దేవుడు నా నవ్వులో ఇంత మహిమ దాచాడా! అని గర్వపడటం మొదలుపెట్టా.



మళ్ళీ మళ్ళీ నవ్వడం నేర్చుకున్నా. నేను నవ్విన ప్రతి సారి, మా నాన్న ముఖంలో ఆనందం పది రెట్లు ఎక్కువగా కనిపించేది. మా నాన్న నన్ను ముద్దులతో ముంచేయటం మొదలుపెట్టారు. అలా ఆ సాయంత్రాలు మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని పెంచాయి.

కొన్నాళ్ళకి, నా చిట్టి పాదాలకి కొంచెం బలం చేకూరింది. నడక నేర్చుకుందామని ప్రయత్నించా. కానీ ఫలితం లేదు. పదే పదే పడిపోతూనే ఉన్నా. ఇంతలో నాన్న తన చూపుడు వేలును నాకు అందించాడు. నేను నడవలేకపోతున్నానని వెక్కిరిస్తున్నాడనుకున్నా! "నా వేలు పట్టుకుని నిల్చో నాన్నా" అన్నారు.

నిలబడగలిగాను కానీ, నా అడుగులు ఇంకా తడబడుతూనే ఉన్నాయి. ఆ మహా శివుడిని మనసులో ప్రార్థించడం మొదలుపెట్టా. తన ఢమరుక నాదంతో నా పాదాలని ప్రేరేపించమని ప్రాధేయపడ్డాను. ఆ ఢమరుక నాదపు సడిలో, వడి వడిగా అడుగులు వేయటం నేర్చుకుని మా నాన్నను ఆశ్చర్యపరుద్దామనుకున్నా. ఆ శ్రీమహాశివుడికి నా మొర వినిపించలేదేమో! నా ప్రార్థనకి జవాబు దొరకలేదు. ఇంతలో మా నాన్న వెల్లకిలా పడుకున్నారు. నన్ను తన రెండు చేతులతో పట్టుకుని తన గుండెల మీద నిలబెట్టుకున్నారు. ఢమరుక నాదం లేకపోతేనేం!, నా గుండె చప్పుడుని నీ అరికాళ్ళతో అనుభవించి అడుగులు వేయటం నేర్చుకోమని అభయమిచ్చారు. ఏం మాయో తెలీదు. నాన్న గుండె చప్పుడు నా కాళ్ళకి తగలగానే నేనే శివుడిలా మారిపోయా. నడక రాని నేను నాన్న గుండెల మీద యధేచ్ఛగా నాట్యం చేయటం మొదలుపెట్టా.

నడక నేర్చిన నా చిన్ని పాదాలు కొత్త గమ్యాలను వెతకటం ప్రారంభించాయి. నడవటం మొదలుపెట్టాను. కొంత దూరం వెళ్ళాక, అటూ ఇటూ చూశాను. ఎవ్వరూ కనిపించలేదు. భయం వేసింది. ఆ శ్రీమహా విష్ణువు అన్ని చోట్ల ఉంటాడుగా, మరి నాకు భయమెందుకు. ఆయన్నే పిలుద్దాం అని మనసులో తలుచుకున్నా. ఆయన కనిపించలేదు గాని వినిపించాడు. "ఏమైంది బాలకా" అని అన్నాడు. "భయం వేసింది స్వామి. అందుకే పిలిచా" అన్నా నేను.

భయం ఎందుకు? నీవు నడుస్తుంది మీ నాన్న నీడ లోనేగా" అన్నాడు. ఆశ్చర్యం వేసి వెనక్కి తిరిగి చూసా. అవును నాన్న నా వెనకే ఉన్నారు. నాకు తగినంత స్వేచ్ఛనిస్తూ, నా ప్రయాణాన్ని గమనిస్తూ, నన్ను ఏ ప్రమాదం తాకకుండా, నాకు రక్షణగా నా వెనకే నడుస్తున్నారు. నా మనసులో భయం తొలగి ముఖంలో చిరునవ్వు మొదలయ్యింది. అప్రయత్నంగానే నా పెదవులు 'నాన్న' అని పలకటం మొదలుపెట్టాయి. నాన్న నన్ను ఎత్తుకుని నా ముఖమంతా ముద్దులతో ముంచేశారు. మళ్ళీ మళ్ళీ నాన్న అని పిలవమన్నారు. నేను పిలిచిన కొద్దీ, నాన్న ముఖంలో ఆనందం రెట్టింపు అవుతూనే ఉంది.

నాకు ఏ అవసరం వచ్చినా, ఏడ్చి ఆ దేవుడిని పిలిచే బదులు, మా నాన్నని పిలవ డమే మేలు అనిపించింది. దేవుడు వచ్చేవాడో, రాడో తెలీదు గాని మా నాన్న మాత్రం నన్ను కంటికి రెప్పలా కాపాడుతూనే ఉన్నాడు. నా అవసరాలన్నీ, నేను చెప్పక ముందే తెలుసుకుని మరీ తీర్చేవాడు. కొన్నాళ్ళకు నాన్న కూడా ఆ దేవుడి దగ్గరికి వెళ్ళిపోయారు. కానీ ఆయన నేర్పిన జీవిత పాఠాలు నాకు తోడుగా ఉండేవి.

ఆఖరికి నేను కూడా ఆ దేవుడి దగ్గరికి తిరుగు ప్రయాణం మొదలుపెట్టాను.

నీ జీవిత మజిలీ ఎలా సాగింది?" అని ప్రశ్నించారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు.

"మీరు నాకు ఏ మంత్రమూ ఉపదేశించకపోయినా, నా జీవన చక్రం బాగానే సాగింది ప్రభు." అని సమాధానం చెప్పాను గర్వంగా.

అదేంటి అలా అంటావ్! మేము నీ నోట పలికించిన మంత్రాన్ని రోజు నువ్వు పఠిస్తుండటం మేము గమనిస్తూనే ఉన్నాం" అన్నారు మూకుమ్మడిగా.

నాకు ఏం అర్థం కావట్లేదు స్వామి" అని బదులిచ్చా నేను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు ఒకరిలో ఒకరు ఐక్యం అవుతూ ఒకే రూపంగా మారి ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యపోయాను. మా నాన్న రూపం నా ముందు ప్రత్యక్షమైంది. అప్పుడు గానీ అర్థం కాలేదు ఈ మనిషి బుర్రకి, (మట్టి బుర్రకి). "అమ్మ ఆ దేవుడి అంశ అని" "నాన్న సాక్షాత్ దేవుడని". మిమ్మల్ని గుర్తించలేకపోయాను, నన్ను క్షమించండి స్వామి. అని ఆయన పాదాలమీద సాగిలపడ్డాను.

ఆ దేవుడి ముఖంలో అదే చెరగని చిరునవ్వు. నా భుజాల మీద చేయి వేసి పైకి లేపారు. ప్రేమగా హత్తుకున్నారు. నన్ను క్షమించి, నా ఆత్మకు మోక్షం ప్రసాదించండి స్వామి అని అడిగా ఆయన చెవిలో. క్షమిస్తా, కానీ ఒక్క షరతుతో అన్నాడు ఆ దేవ దేవుడు. ఏమిటది స్వామీ! అని అడిగా ఆశ్చర్యంగా. నన్ను ఆఖరుసారిగా 'నాన్న' అని పిలవగలవా అని అడిగారు ఆ సర్వేశ్వరులు. ఆ మహా మంత్రాన్ని ఇంకోసారి జపించడానికి, నిముషం కూడా ఆలస్యం చేయలేదు నేను. నాన్న అని పిలిచి ఆయనలోనే ఐక్యం అయిపోయా. ఈ వ్యాసం ప్రతి ఒక్క నాన్నకు అంకితం...

నాన్న గొప్పదనాన్ని మనమందరం యువతకు తెలియచేయాలి. ●

## జగద్గురు శ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

# రెండు తప్పుల నుండి తప్పించుకుందాం



సాధారణంగా మనిషి రెండు తప్పులను చేస్తూ ఉంటాడు. మొదటి తప్పు ఆత్మస్తుతి. రెండవది పరనింద, రెండూ తప్పులే. మనిషి తానెంత గొప్పవాడైనా తనను తాను పొగుడుకోకూడదు. యితరులు పొగిడితే మంచిది.

**ఇన్ద్రో2పి లఘుతాం యాతి స్వయం ప్రఖ్యాపితైర్గుణైః ।**

దేవతల అధిపతి అయిన దేవేంద్రుడు కూడ తన గొప్పతనాన్ని తానే ప్రశంసించుకుంటే ఆ గొప్పతనాన్ని కోల్పోక తప్పదని చెప్తారు. అందువలన ఎట్టి పరిస్థితులలోను మానవుడు ఆత్మస్తుతి చేసుకోకూడదు.

ఇతరులను నిందించడమూ పాపమే. ఒక మనిషిని హత్య చేసినదానికంటే అది ఎక్కువ పాపం. ఇందుకు మహాభారతంలో ఒక ఉదాహరణ ఉంది. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో కర్ణునితో యుద్ధం చేయటం ధర్మరాజుకు ఒకప్పుడు చాలా కష్టమైంది. ఆ కష్టానికి తట్టుకోలేక ధర్మరాజు యుద్ధభూమి నుండి వెనుదిరిగి శిబిరానికి వెళ్లిపోయాడు.

యుద్ధభూమిలో ధర్మరాజు కనపడక అర్జునుడు చాల చింతించాడు. అతని కోసం వెదకి, వెదకి చివరికి, శిబిరానికి చేరాడు. అక్కడ ధర్మరాజు వెంటనే 'కర్ణుని చంపావా? లేదా?' అని అర్జునుడు ప్రశ్నించాడు. ఆశ్చర్యంతో లేదు అని అర్జునుని ప్రశ్నించాడు. ఆశ్చర్యంతో లేదు అని అర్జునుడు సమాధానమిచ్చాడు. తాను మిమ్ము వెతుకుతూ ఇక్కడికి వచ్చానని చెప్పాడు. అప్పుడు కోపంతో ధర్మరాజు యిలా అన్నాడు. "కర్ణుని చంపలేకపోతే, నీకు గాండీవమెందుకు? దండగ. దానిని ఎవరికైనా దానం చేయి".

ఆ మాటలు వినగానే అర్జునుడి మనస్సు గాయపడింది. శ్రీకృష్ణుని ప్రశ్నించాడు. "నా గాండీవాన్ని త్యజించమన్న వారిని నేను చంపుతానని నేను శపథం పట్టాను. అందువలన నేను ధర్మరాజుని చంపాలి. కాని ఆయన నా అగ్రజుడు. ఇప్పుడు నా శపథాన్ని నెరవేర్చు కొనడమెలా?"

అర్జునుని ప్రశ్నకు శ్రీకృష్ణుడిలా సమాధానమిచ్చాడు. "ధర్మరాజు వంటి మహా పురుషుని చంపాలనుకోవటమే మహాపాపం. కాని నీ శపథాన్ని నెరవేర్చక తప్పదంటున్నావు. నీవు ధర్మరాజును ఎటువంటి కారణం లేకుండానే నిందించు. అలా నిందించటమే హత్య చేసినట్లు." దీని నుండి ఒక వ్యక్తిని నిందించటం అతనిని హత్య చేసినదానికంటే ఘోరమైన పాపమని మనకు తెలుస్తోంది. అందువలన మనల్ని మనం పొగుడుకోవటం, యితరులను నిందించటం మనం చేయకూడని పనులు. మన జీవితంలో ఆ రెండు తప్పులు చేయకూడదు. **యదీచ్ఛసి వశీ కర్తుం జగదేకేన కర్మణా పరాపవాద సస్యేభ్యః గాశ్చరన్తీర్నివారయ॥** ఇతరుల గురించి చెడుగా మాట్లాడడం మానివేస్తే వాళ్లు మీకు సహాయపడవచ్చు. ●





**SRI RAJARAJESWARI JEWELLERY**

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# కార్తీకమాసం

స్నాన, దాన, జపాలు, పూజలు, ఉపవాస వ్రతాలు, దీపాలు వెలిగించడం, వన భోజనాలు వంటి వాటిని చేయడం వల్ల జన్మజన్మల పాపాలను ప్రక్షాళన చేసి అనంతమైన పుణ్యఫలాలను ప్రసాదించే మహిమాన్వితమైన మాసం "కార్తీకమాసం'. చాంద్రమానం ప్రకారం కార్తీకమాసం ఎనిమిదవది. శరదృతువులో రెండవ మాసం. ఈ మాసంలోని పూర్ణిమ నాడు చంద్రుడు కృత్తికా నక్షత్ర సమీపంలో సంచరిస్తూ ఉండడం వల్ల ఈ మాసానికి "కార్తీకమాసం" అని పేరు వచ్చింది.

**"న కార్తీక నమో మాసః న దేవం కేశవాత్పరం!**
**నచవేద సమం శాస్త్రం న తీర్థం గంగాయాస్థమమ్"**

అని స్కంద పురాణంలో పేర్కొనబడింది. అంటే "కార్తీకమాసానికి సమానమైన మాసము లేదు. శ్రీమహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడు. వేదముతో సమానమైన శాస్త్రము లేదు గంగతో సమానమైన తీర్థము లేదు." అని అర్థం.

కార్తీకమాసం శివకేశవులిద్దరికీ అత్యంత ప్రీతికరమైన మాసం. కార్తీకమాసంలో ప్రతీరోజూ తెల్లవారుఝాముననే స్నానమాచరించవలెను. అప్పుడే అది కార్తీక స్నానమవుతుంది. నిత్యం దీపాన్ని వెలిగించినా, ఆరాధించినా, దీపమును కార్తీక మాసంలో వెలిగించడం, నదిలో దీపాలను వదలడం, ఆకాశ దీపాలను వెలిగించడం, దీప దానం చేయడం వంటి ఆచారాలను పాటించ వలెను. కార్తీకమాసమంతా ఇంటి ముందు ద్వారానికి ఇరువైపులా సాయంకాలం దీపాలను వెలిగించవలెను. అట్లే సాయంత్ర సమయంలో శివాలయాల్లో గానీ వైష్ణవాలయాల్లోగానీ గోపురద్వారం వద్దగానీ, దేవుని సన్నిదానంలోగానీ ఆలయప్రాంగణంలోగానీ దీపాలు వెలిగించిన వారికి సర్వ పాపములు హరించి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని శాస్త్ర వచనం. ఇతరులు వెలిగించిన దీపం ఆరిపోకుండా చూడడం కూడ పుణ్యప్రదమే!



కార్తీక సోమవారాలు లేదా పౌర్ణమినాడు గాని లేక ఇతర దినాల్లో అయినా సాయం సమయాలలో శివాలయంలో ఉసిరికాయపైన వత్తులను ఉంచి దీపం వెలిగించడం శ్రేష్టం. ఆవు నెయ్యితో దీపం వెలిగించడం శ్రేష్టం. లేదంటే నువ్వుల నూనెతోగానీ, కొబ్బరినూనెతోగానీ, నెయ్యితోగాని, అవిశనూనెతోగానీ, ఇప్పనూనెతో గానీ, లేదంటే కనీసం ఆముదంతోనైనా దీపమును వెలిగించవలెను. అంతే కాకుండా కార్తీక మాసంలో దీపదానం చేయాలని శాస్త్రవచనం. కార్తీకమాసంలో ముప్పై రోజులలో దీపం పెట్టలేనివారు శుద్ధద్వాదశి, చతుర్దశి, పూర్ణిమ దినాల్లో తప్పక దీపం పెట్టాలని శాస్త్ర వచనం. ఈ విధంగా కార్తీకమాసంలో దీపాలను వెలిగించడం, దీపదానం చేయడం వల్ల సకల జీవరాశులే కాకుండా రాళ్ళూ, రప్పలు, వృక్షాలు వంటివి కూడా ముక్తి పొందుతాయని పురాణ కథనం.

## కార్తీకమాసంలో ఆచరించాల్సిన విధులు :

కార్తీక స్నానాన్ని ఆశ్వీయుజ బహుళ అమావాస్య అంటే దీపావళి రోజు నుంచి ప్రారంభించవలెను. నెలంతా కార్తీక స్నానం చేయడం మంచిది. వీలుకానివారు సోమవారాల్లోనూ శుద్ధ ద్వాదశి, చతుర్దశి, పౌర్ణిమరోజుల్లోనైనా తప్పక ఆచరించ వలెను. శుద్ధ ద్వాదశినాడు తులసి పూజ చేయవలెను.

ఈ నెలంతా శ్రీమహావిష్ణువును తులసీదళములు, జాజిపూలతో పూజించ వలెను. ఈ నెలంతా శివుడిని మారేడుదళములతోనూ, జిల్లేడుపువ్వులతోనూ పూజించవలెను. ఈ మాసంలో కార్తీక పురాణాన్ని పారాయణం చేయడం మంచిది.

## కార్తీక మాసంలో పండుగలు

**శుక్లపక్ష విదియ : భాతృ ద్వితీయ**

దీనికే యమ ద్వితీయ, భగినీ హస్త భోజనం అని పేర్లు, ఈ దినం పురుషులు సొంత ఇంటిలో భోజనం చేయరాదు. ఈ దినం సోదరి ఇంటిలోగాని, లేదంటే సోదరితో సమానమైనవారి ఇంట భోజనం చేయవలెను. ఈ విధంగా చేస్తే అప మృత్యుభయం, నరకలోకభయం తొలగిపోతాయి. అంతే కాకుండా భోజనం పెట్టిన సోదరి కలకాలం పుణ్యస్త్రీగా ఉంటుందని శాస్త్రవచనం.

**శుక్లపక్ష చవితి "నాగుల చవితి"**

కార్తీక శుక్లపక్ష చవితినాడు మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో నాగులచవితి పర్వదినం జరుపుకుంటారు.

**శుక్లపక్ష ఏకాదశి : ప్రభోధన ఏకాదశి**

ఆషాడ శుక్ల పక్ష ఏకాదశి నాడు పాలకడలిలో శేషశయ్యపై శయనించి, యోగనిద్రలో గడిపిన శ్రీమహావిష్ణువు ఈ దినం నిద్ర నుంచి మేల్కొంటాడు. కాబట్టి దీనికి 'ఉత్థాన ఏకాదశీ లేదా 'ప్రబోధన ఏకాదశి ' అని పేర్లు. ఈ దినం ఉపవాస వ్రతం పాటించి శ్రీమహావిష్ణువును పూజించవలెను. అంతేకాకుండా తొలి ఏకాదశి నాడు ప్రారంభమైన చాతుర్మాస్య వ్రతానికి ఈ ఏకాదశి చివరిరోజు.

**శుక్లపక్ష ద్వాదశి: క్షీరాబ్ధి ద్వాదశి**

పూర్వం కృతయుగంలో దేవతలు, దానవులు అమృతం కోసం క్షీరసాగర మధనం చేసింది ఈ రోజే. అందుకే దీనికి క్షీరాబ్ధి ద్వాదశి, చిలుకు ద్వాదశి అని పేర్లు. శ్రీమహాలక్ష్మిని శ్రీమహావిష్ణువు వివాహం చేసుకున్నది కూడా ఈనాడే . ఈ రోజు ఇంటి యందున్న తులసికోట వద్ద శ్రీమహావిష్ణువును లక్ష్మీసమానురాలైన తులసిని పూజించవలెను.

**శుక్లపక్ష చతుర్దశి : వైకుంఠ చతుర్ధశి**

వైకుంఠవాసుడైన శ్రీమహావిష్ణువు ఈ దినం వైకుంఠను వదిలి వారణాసి వెళ్ళి పరమశివుడిని పూజించినట్లు కథనం. ఈ నాడు శైవాలయాలకు వెళ్ళి దీపం వెలిగించవలెను.

**శుక్లపక్ష పూర్ణిమ :**

ఈ దినం శివాలయాల్లో నిర్వహించే 'జ్వాలా తోరణం'ను దర్శించడం మంచిది. సాయంత్రం సమయంలో శివాలయంలోగానీ, వైష్ణవాలయంలో గానీ దీపాలను వెలిగించవలెను. ఈ దినం శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని పూజించడం, మార్కండేయ పురాణం దానం చేయడం విశేష ఫలితాలను ఇస్తుంది.

**కృష్ణపక్ష చవితి : కరక చతుర్ధి**

ఇది వినాయకుడుకి సంబంధించినది. ఈ వ్రతం మహిళలు చేయడం మంచిది.

**వృశ్చిక సంక్రమణం**

ప్రత్యక్ష భగవానుడైన శ్రీసూర్యభగవానుడు ఈరోజు తులారాశి నుండి ఎనిమిదవ రాశి అయిన వృశ్చికరాశిలోనికి ప్రవేశిస్తూ ఉన్నాడు. ఈ సందర్భంగా సంక్రమణ స్నానాలు, పూజలు, జపాలు, దానాలు, దేవాలయ సందర్శనలు చేయడం వల్ల సర్వవిధాలా శుభఫలితాలను ఇస్తుంది.

కార్తీకమాసంలో విధులను పాటించడం ద్వారా ఆధ్యాత్మిక పరమైన ఫలాలను పొందడమే కాకుండా మారుతున్న సామాజిక పరిస్థితులు, ఆహారపు అలవాట్ల వల్ల కొత్తగా తలెత్తుతూ ఉన్న ఆరోగ్య సమస్యల నుంచి ఉపసమనం పొందవచ్చు.

# కవి, ఋషి, యోగి, క్రాంతదర్శి, అష్టాదశ పురాణకర్త వ్యాస ముని!

వ్యాసుడే విష్ణువు, విష్ణువే వ్యాసుడు' అంటారు. విష్ణువాంశ సంభూతుడే వ్యాసుడు. మహాభారత, భాగవతములనే గాకుండా, అష్టాదశ పురాణములను వ్రాసిన కవి పుంగవుడు, ఋషి, యోగి, ముని, క్రాంతదర్శి. ఆయన కుటుంబ చరిత్రే మహాభారతం ఆయన తన దీర్ఘ దృష్టితో ఊహించి, రచించిన గ్రంథం ఒక రకంగా ధర్మశాస్త్రంబని చెప్పవచ్చు, వేద ధర్మానుసార గ్రంథం, అందుకే మహాభారతం పంచమవేదమైంది. అట్టి అమ్మహాగ్రంథకర్త గురువులకు గురువు మహాగురువు. పీఠాధిపతులందరూ భక్తి శ్రద్ధలతో గురుపూజను వ్యాసపూజగా చేయడం జరిగింది. ధర్మగ్రంథాల ఉద్ధారకుడాయన. నిజమైన యోగి, సాధు పుంగవుడు ఘర్షణలకు తావులేని సాధు జీవితమునే నెరపాడు.

పరాశర సత్యవతులకు సద్యోగర్భమున జనించినవాడు వ్యాసుడు. లోక హితార్థం కారణజన్ముడుగ జన్మించాడు. తండ్రి సంకల్పానుసారంగా తపస్సుకు వెడుతూ–తల్లి సత్యవతికి నమస్కరిస్తూ – 'అమ్మా' దిగులు పడవద్దు, మీరు పని కలిగి ఎపుడు నన్ను స్మరిస్తే అపుడు మీ దగ్గర ఉంటాను 'అమ్మా!' అంటూ తల్లి అనుజ్ఞగొన్నాడు. కృష్ణ ద్వీపానికి తరలి వెళ్లాడు.

లోక హితాన్ని కోరుతూ తపస్సును చేస్తూనే వేద విభాగాన్ని చేస్తూ, పురాణ వ్యాసాంగం కొనసాగిస్తూ శిష్యశ్రేణికి శిక్షణ యిస్తూ, కాలహరణం కానివిధంగా లోక కళ్యాణమే ధ్యేయంగా ధర్మ సంస్థాపనార్థం వ్యాసంగాలు కూరుస్తూన్న సమయంలో తల్లి సత్యవతి తలచుకుంది. వెంటనే తల్లి ముందు కనబడ్డాడు. నాయనా–కురు వంశం అంతమయ్యే సమయమాసన్నమైంది. భీష్ముడు తన ప్రతిజ్ఞను వీడి, పెండ్లి చేసుకోనంటున్నాడు. నీవెలాగైనా కురువంశాన్ని నిలిపే ప్రయత్నం చేయాలని అర్థిస్తుంది. రాజ్యం అరాచకం గాకుండా సత్వర ప్రయత్నం చేయాలంటుంది. సాలోచన చేసి అంబా అంబాలికలను అనుగ్రహిస్తాడు. కానీ వారి భంగిమలను బట్టి అంధుడైన ధృతరాష్ట్రుడూ, పాండురోగి యైన పాండురాజూ కలుగుతారు. వారిని జూచి నిట్టూర్చిన సత్యవతి మరోమారు వ్యాసుణ్ణి స్మరిస్తుంది. ఈసారి అంబాలిక తనకు మారుగా దాసీని పంపిస్తుంది. దాసీ పుత్రునిగా విదురుడు జన్మిస్తాడు.

ధృత రాష్ట్ర, పాండు రాజులకు వివాహములు కావడం, గాంధారికి నూరుగురు కుమారులూ, ఒక కుమార్తె, కుంతికి ఐదుగురు కుమారులు కలగడం, వారు పెరిగి పెద్దయినట్లుగానే వారి మధ్య వైరమూ వయసు పెరిగినట్లు పెరగడం జూచి వ్యాసుడు వ్యాకులపడతాడు. ధృతరాష్ట్రుణ్ణి మందలించినట్లుగా గాకుండా, ఉప దేశించినట్టు సలహాలు యిస్తాడు.

అలాగే ఆయన పాండవులు లక్క గృహంలో బంధించి నపుడు కుంతీ పాండవులకు ప్రత్యక్షమై ఏకచక్రపురం వెళ్లమనీ, అర్జునుడు మత్య యంత్రం కొట్టినపుడు, బ్రాహ్మణ బ్రహ్మచారియైన పార్థుని జూచి, ద్రౌపదిని యివ్వడానికి సందేహిస్తున్న ద్రుపదుణ్ణి జూచి, పాండవుల విషయం, అలాగే ద్రౌపది పూర్వ వృత్తాంతం చెప్పి అన్నదమ్ములయిదుగురికీ పాణిగ్రహణం చేయించడంలోనూ వ్యాసుని దూత్యం ఉన్నది.

పాండవులకు శ్రీకృష్ణుని తోడు లభించేవరకూ వ్యాసుడే సహకరిస్తూ వచ్చాడు. ధృతరాష్ట్రుణ్ణి కురు పాండవుల్ని సమదృష్టితో చూడమని చెప్పడంలోనూ ఆయన కర్తృత్వం వహించాడు. కానీ తన మాటలను పెడచెవిని పెట్టాడని ఎప్పుడూ బాధపడలేదు. కురుక్షేత్ర సంగ్రామం ముగిసిన తరువాత ధృతరాష్ట్రుణ్ణి ఓదార్చడానికి వచ్చాడు. అటు తరువాత చని పోయిన తన బిడ్డల్ని చూడగోరుతున్నానని అన్నప్పుడు కౌరవు లందర్నీ సాక్షాత్కరింపచేశాడు. అతణ్ణి వైరాగ్యసంపణ్ణు కావించినదీ వ్యాసులే! దుష్టులను శిక్షించాలనీ, శిష్టులను రక్షించాలనీ భావించి, పాండవులు రక్షింపబడేట్టు,



కౌరవులు శిక్షింపబడేట్టు ధర్మసంస్థాపనా దృష్టి చూపినదీ వ్యాసుడే. ఆయన ఊహించిందే మహాభారత సంగ్రామం. ఇన్నీ చేసిన ఆయనకు పుత్రప్రేమపై దృష్టిపడింది. దైవాన్ని వేడి శుకుణ్ణి పుత్రునిగా పొందాడు. సత్పుత్రుడు కలిగినందులకు పొంగిపోయాడు. అతడు తండ్రికి తగినట్టుగానే పెరిగాడు. భవబంధాలు ఇష్టంలేని అతడు ఒకసారి తండ్రిని మోక్షమార్గం ఉపదేశించమని కోరాడు. ఇందుకు తగినవాడు రాజర్షి జనక మహారాజుయనీ, ఆయన పూర్ణ పురుషత్వాన్ని శ్లాఘిస్తూ, జనకుని వద్దకు పంపిస్తాడు.

కృష్ణుణ్ణి పరిపూర్ణ అవతార పురుషునిగా గ్రహించి దర్శించింది వ్యాసుడే! దైవబోధలైన వేదాల్నీ, పురాణేతిహాసాల్నీ గ్రంథస్థం కావించిందీ ఆయనే! ఆయన కారణంగానే భవిష్యత్తరాలకు అపార విజ్ఞాన సంపద అందింది. జ్ఞాన సంపన్నులు పెరిగారు. గురువులకు గురువైన ఆదిగురువుగా, పరమ యోగిగా, శాంతచిత్తునిగా, మహర్షిగా వ్యాస మహర్షిని కీర్తిద్దాం; వ్యాస భగవానునిగా ఆరాధిద్దాం. ●



**దత్తాత్రేయుడు- త్రిమూర్తుల అంశ. గురువులకే మహాగురువు. దత్త సంప్రదాయంలో పిఠాపురానికి ప్రత్యేక స్థానం ఉంది.**

**దత్తుడి తొలి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు నడయాడిన ప్రాంతం పిఠాపురం. కాబట్టే, దత్తజయంతి ప్రధానంగా పిఠాపురంలో జరపాలి!**

**జటాధరం పాండురంగం**
**శూలహస్తం కృపానిధిం**
**సర్వరోగహరం దేవం**
**దత్తాత్రేయమహం భజే**

తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురాన్ని పీఠికా పురమని పిలిచేవారు.

దేశంలోని త్రిగయల్లో... పిఠాపురం పాదగయ. ఇక్కడే కుక్కుటేశ్వరస్వామి ఆలయం ఉంది. గయాసురుడనే రాక్షసుడని సంహరించడానికి శివుడు కోడిరూపం ధరించడం వలన స్వామికి ఆ పేరు వచ్చింది.

ఆదిశంకరుడు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి ఆలయమూ ఇక్కడే ఉంది. వీటన్నిటికి తోడుగా... పిఠాపురం సుప్రసిద్ధ దత్తక్షేత్రం.

దత్తాత్రేయుడి తొలి అవతారమైన శ్రీపాద వల్లభుడు నడయాడిన నేల. శ్రీపాదవల్లభ క్షేత్రం భక్తజనులతో నిరతమూ కళకళలాడుతూ ఉంటుంది.

కుక్కుటేశ్వర ఆలయ ఆవరణలో ఔదుంబర వృక్షం ఉన్న మేడిచెట్టు మహిమాన్వితమని భావిస్తారు. చెట్టు మొదట ఉన్న పాదుకలు శ్రీపాదవల్లభుల వారివే అని భక్తుల ప్రగాఢ నమ్మకం.

శ్రీపాద వల్లభుడి జన్మవృత్తాంతం తెలిపే ఐతిహ్యమిది.

పూర్వం పిఠాపురంలో సుమతి, అప్పలరాజుశర్మ అనే దంపతులు ఉండేవారు. దత్తుడి పరమభక్తులు వారు. జన్మజన్మలుగా దత్తాత్రేయుడినే సేవించేవారు. ప్రతి జన్మలోనూ వారికి స్వామి దర్శనం ఇచ్చేవాడు. అయినా ఒక్క వరమూ కోరుకోలేదు. దత్త దర్శనమే మహద్భాగ్యమనుకున్నారు. పిఠాపురంలో స్వయంభువై వెలసిన దత్తుడు వారి ఇంటికి వెళ్లి నిత్యం భిక్ష స్వీక రించేవాడు. ఓ సందర్భంలో సుమతి కోరికను మన్నించి... దత్తాత్రేయుడి తొలి అవతారమైన శ్రీపాదవల్లభుడి రూపం ఎలా ఉంటుందో కళ్లకు చూపించాడు. 'ఆహా! కంటే ఇలాంటి బిడ్డనే కనాలి!' అనుకుందా ఇల్లాలు. ఆమె కోరికను మన్నించి... సుమతమ్మ గర్భంలో జన్మించాడు దత్తుడు. స్వామి పిఠాపురంలోనే జన్మించడం వెనుక ఓ వృత్తాంతం ఉంది. భరద్వాజ మహర్షి ఇక్కడో యజ్ఞం చేశాడు. ఆ ఫలాన్ని దత్తాత్రేయుడికి ఇస్తూ... 'మహానుభావా! ఇక్కడ జన్మించి ఈ నేలను చరితార్థం చేయమని వేడుకున్నాడు. అలా పుణ్యదంపతుల కోరిక తీర్చడానికీ, మహర్షికిచ్చిన మాట నిలబెట్టుకోడానికీ దత్తాత్రేయుడు శ్రీపాద వల్లభుడిగా పిఠాపురంలో జన్మించాడు. ఆరో ఏట, ఉపనయనం అయిన మరుక్షణమే చతుర్వేదాలు గడగడా అప్పజెప్పడం, పదహారో యేట, తన అవతార లక్ష్యాన్ని తల్లికి వివరించి, సన్యాస దీక్ష స్వీకరించి, దత్త ధర్మ ప్రచారానికి బయల్దేరాడు. అటునుంచి అనేక ప్రాంతాల్లో సంచరించి మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుపురానికి చేరుకున్నాడు. ఇక్కడి భక్తకోటికి అనేక మహిమలు చూపాడు.



## శ్రీ పాదవల్లభుడే దత్తాత్రేయుడు!

**షిర్డీసాయిబాబాను దత్తాత్రేయునిగా కొలిచే వారెందరో!**
**షిర్డీని దర్శించేవారిలో సగానికి మించిన భక్తులు తెలుగువారే!**
**దత్తుని తొలి అవతారం పిఠాపురంలోనే వెలిసింది!**
**దత్త సాంప్రదాయ ఆవిర్భావం ఆంధ్రదేశంలోనే ఆవిర్భవించింది!**
**ప్రతీ దత్తభక్తుడూ దర్శించదగిన క్షేత్రం పిఠాపురం నేను దర్శించి కృతార్థుడనయ్యాను.**


దత్త జయంతి సందర్భంగా పిఠాపురంలోని శ్రీపాద వల్లభ సన్నిధిలో దత్తమాలలు వేసుకుని... అర్ధమండల, సప్తాహదీక్షలు పాటించేవారెంతో మంది ఉన్నారు. అటు పిఠాపురంలోనూ, ఇటు కురుపురం లోనూ ఆ రోజు ప్రత్యేక పూజలు జరుగు తుంటాయి. శ్రీపాద శ్రీవల్లభుడితో పాటూ శ్రీ నరసింహ సరస్వతి స్వామి (మహారాష్ట్ర), శ్రీ మాణిక్య ప్రభుమహరాజ్ (గుల్బర్గా), అక్కల్‌కోట మహరాజ్ (అక్కల్), షిరిడీ సాయి (షిర్డీ)... దత్తుని అవతారాలని భక్తుల విశ్వాసం.

### *దత్తాత్రేయ జననం...*

అత్రి మహర్షి, అనసూయదేవి - ఆదర్శదంపతు లుగా ముల్లోకాల్లోనూ ప్రసిద్ధిగన్నారు. నారదుడు గులకరాళ్ల మూటతో ఆకాశ మార్గంలో వెళ్తుండగా... లక్ష్మి, సరస్వతి, పార్వతి ఎదురుపడ్డారు. ఆ మూటను చూసి... 'ఎవరికీ గులకరాళ్లు నారదా!' అని ప్రశ్నించారు. భూలోకంలో ఉన్న అనసూయ కోసమని చెప్పాడు. ఆమె రాళ్లను అన్నంలా మార్చగల మహాపతివ్రత అని మెచ్చుకున్నాడు. ఎంత వారు దేవతలైనా ముగ్గురమ్మలకూ అహం ఉంటుందిగా! ఆమె 'మాకంటే పతివ్రతా?' అంటూ అనసూయను పరీక్షించడానికి త్రిమూర్తులను భిక్షువుల రూపంలో భూలోకానికి పంపారు. ఆ సాధ్వి అతిథుల్ని సాదరంగా ఆహ్వానించింది. వారు 'అనసూయాదేవి! నువ్వు వివస్త్రగా మాకు వడ్డన చేయాలి' అన్న షరతు విధించారు. దీంతో ఆమె... ఆ సృష్టిపాలకుల్ని పసిబిడ్డల్ని చేసింది. గోముచేసి గోరుముద్దలు తినిపిం చింది. జోలపాడి నిద్రపుచ్చింది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు పసివాళ్లయి పోవడంతో... ముగ్గు రమ్మలకూ ఏం చెయ్యాలో పాలుపోలేదు. నారదుడి సలహా ప్రకారం అనసూయాదేవిని క్షమాపణ కోరారు. త్రిమూర్తులకు మునుపటి రూపం వచ్చింది. అన సూయ భక్తికి మెచ్చి... తమ అంశతో ఓ బిడ్డను ప్రసాదించారు.

మార్గశిర పౌర్ణమినాడు దత్తాత్రేయుడు ఆ తల్లి కడుపున జన్మించాడు. ప్రతీ భక్తుడూ దర్శించదగిన క్షేత్రం పీఠికా (పిఠా) పురం.

- కృతజ్ఞతలు **పి. రమేష్,** న్యూస్‌టుడే, పిఠాపురం



# నాళం కృష్ణారావుగారు

నాళం కృష్ణారావుగారు 1881 జనవరి 18వ తేదీన నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానం. వీరు తూర్పు గోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. తన పెద్ద కుమారునికి కులాంతర వివాహం చేశారు. వితంతు వివాహాలు జరిపించారు. భావిభారత పౌరుల కోసం తేటగీతిలలో కావ్య రచనలు చేశారు. వీరు 1921లో రాసిన గాంధీ 'విజయ ధ్వజ' నాటకాన్ని, 1932లో రాసిన 'గాంధీ 'దశావతార లీలలు' గ్రంథాలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. జాతీయ లోకోక్తుల పేరుతో పదివేల సామెతలను సేకరించారు. శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కృష్ణారావుగారు నిరాడంబరుడు, కీర్తికాంక్షా రహితుడు, సేవకే ప్రాధాన్యం ఇచ్చిన మనీషి మధురకవి, సంగీత సాహిత్యాల నిధి, స్వాతంత్ర్య సమరయోధుడు, బాల సాహితీ బ్రహ్మ, తెలుగు వైతాళికుడు, భాషావేత్త, సంఘ సంస్కరణాభి లాషి అయిన నాళము వారు గ్రంథాలయోద్యమంపై తమ దృష్టిని మరల్చడం ఆంధ్రుల అదృష్టమనే చెప్పాలి. ఆంధ్రులకు వీరు ప్రసాదించిన గొప్ప కానుక రాజమండ్రిలోని నేటి మన గౌతమీ గ్రంథా లయమే. యుగ పురుషులు శ్రీ వీరేశలింగంగారికి సంఘ సంస్కరణోద్యమంలో కుడిభుజంగా వుంటూ ఒకసారి సంఘ బహిష్కరణకు కూడా గురయ్యారు. 1911-1915 ప్రాంతాల్లో 'మానవ సేవ' అను సచిత్ర మాసపత్రికను నడిపి దానిద్వారా సంఘ సేవ, భాషా సేవలు చేశారు. మహాత్ముని సందేశాన్ని అందుకొని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.



## గ్రంథాలయ సేవ:

సామాన్య ప్రజలలో విజ్ఞాన జ్యోతి వెలిగించి వారికి పౌర గ్రంథాలయ ప్రయోజ నాలు అందేటట్లు చేయాలనే కోర్కెతో, కృష్ణారావుగారు రాజమండ్రిలో తమ పూర్వులు ఏర్పరచిన నాళంవారి సత్రంలోని ఒక గదిలో గ్రంథాలయాన్ని (వీరేశ లింగం గ్రంథాలయం) స్థాపించారు. మొదట్లో దీనికి పేరు పెట్టినట్లు లేదు. దీన్ని పుర ప్రజలందరూ వాడుకొనేటట్లు సౌకర్యం కల్పించారు. కొంతకాలం అయిన తర్వాత యీ గ్రంథా లయాన్ని మరొకచోటుకు మార్చి, దీనికి వీరేశలింగం గ్రంథాలయం అని పేరుపెట్టారు. కాలక్రమేణా యీ గ్రంథాలయాన్ని అభివృద్ధి పరచుకొంటూ వచ్చారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఎదురుకావడంతో, యీ గ్రంథాలయ నామాన్ని సర్వజన పుస్తక భాండాగారంగా1914లో మార్చడం జరిగింది. 1919లో ఈ గ్రంథాలయాన్ని 'వసురాయ గ్రంథాలయం'తో కలిపి గౌతమీ గ్రంథా లయంగా రూపొందించడమైనది. దీని స్థాపనకు కృష్ణారావుగారు ఎంతో కృషిచేసి సఫలీకృతులయ్యారు. నేటి రాజమండ్రి పుర వాసులు యీ గ్రంథాలయంలోని అపారమైన, అమూల్యమైన పుస్తక సంపదను అనుభ విస్తున్నారంటే అదంతా వారి చేతి చలువే.

నాళమువారు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ తొలి కార్య 46 సందర్భులలో ఒకరు. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపు యావజ్జీవ గౌరవ సభ్యులు, 1926లో ఏలూరులో జరిగిన 11వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. వీరు తమ అధ్యక్షోప న్యాసంలో ప్రధాన మంత్రులు, విద్యాశాఖ మంత్రులు చేయని గ్రంథాలయ సేవ గ్రంథాలయోద్యమానికి శ్రీ వావిళ్ళవారు చేశారని చెప్పారు. గ్రంథాలయ సభలను రాజకీయ సభలతో గాని లేదా మరే ఇతర సభలతోగాని కలిపి నిర్వహించడం వలన, ఇవి తమ ప్రత్యేక వ్యక్తిత్వము కోల్పోయి తద్దినము పెట్టు వాని తమ్మునివలె పరిహాన భాజనాలగుచున్నవని వక్కాణించారు. భవనాల కంటెను, గ్యాలరీల కంటెను ప్రొఫెసరులకంటెను, వైస్ ఛాన్సలర్ల కంటెను చక్కని గ్రంథాలయమే ఉత్తమ విద్యాపీఠం కాగలదని నుడివారు.

మద్రాసులో ఉన్న ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం గాని, కన్నెమెరా గ్రంథాలయంగాని, మద్రాసు విశ్వ విద్యాలయ గ్రంథాలయంకాని ఆంధ్రులకు అందు బాటులో లేవని చెప్పారు. అందుకుగాను కుమార్తె యగు ఆంధ్ర విశ్వవిద్యాలయమును ప్రత్యేక కాపురమునకై పంపినప్పుడు తల్లియైన చెన్న విశ్వ విద్యాలయము కొంత యరణముతో పంపుట యుక్తమైయుండును. కాని అరవతల్లికి తెలుగు కూతురుపైనట్టి ప్రేమ యున్నట్టు కన్పించదు. కావున కూతురు తండ్రియగు ప్రభుత్వముతో చెప్పుకొని పై మూడు గ్రంథాలయములలోని ముఖ్య భాగము లను ఆంధ్ర విద్యాపీఠమునకు తెచ్చుకోవలసి యున్నది. అది నెరవేరనే లేదు" అన్నారు. గ్రంథా లయం యొక్క ప్రాముఖ్యతను గూర్చి వీరు ఈ దిగువ గీతికలో ఇలా అందంగా సొగసుగా తన భావాల్ని వెల్లడించారు.

**"గాలిలేకున్న నెట్టైటో గడపవచ్చు**
**గ్రాసమును లేక అవలీల గడపవచ్చు**
**గడపవచ్చునే మనమొక్క గడియయైన**
**గ్రంథభాండాగారములు లేని కాలమందు"**

మీగడ తరకలు, చెరకు ముక్కలు లాంటి వీరి గ్రంథాలయ గీతాలు ఆంధ్ర ప్రజలను ఉర్రూత లూగించాయి. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపు ఆస్థాన కవిగా వీరిని పేర్కొనవచ్చు. వీరు ప్రసాదించిన గౌతమీ గ్రంథాయ మొక్కటి చాలు, ఆంధ్రదేశ గ్రంథాలయ చరిత్రలో వీరి పేరు కలకాలం నిలవడానికి 80 సం॥లు నిండు జీవనం గడిపిన నాళం వారు 1961 మార్చి 17న తనువు చాలిం చారు. మరువలేరు ఆంధ్రులు ఈ మధురకవిని.

కృతజ్ఞతలు : గ్రంథాలయ సర్వస్వం



# తమిళనాడులో తెలుగు వికాసానికి అహరహమూ కృషి చేసిన సాధువరదరాజం పంతులు!

తిరునల్వేలి హల్వా కన్నా రుచ్చమైన మాతృభాష తెలుగుభాషను మాట్లాడుతూ, 'దయచేసి మన తెలుగువారందరూ తెలుగులోనే మాట్లాడండి'-అంటూ ఓ ప్రచారపట్టాను భుజానికి తగిలించుకుని కాలికిబలపం కట్టుకున్నట్లు నడుస్తూ కాలిక్రిందనున్న భూరేణువుల పొరల్లో కూడా తెలుగు భాష అక్షరాలు చొరబడేట్టు తమిళనాడు అంతటా తిరిగిన ఏకైక వీరుడు సాధువరదరాజం పంతులు.

తమిళనాట ఉన్న తెలుగువారికి తెలిసేట్టుగ తెలుగు పదాలను తమిళంలో వ్రాసి, యెలా ఉచ్ఛరించాలో బోధించిన మాతృభాషా బోధకుడు. చేత పెద్దబాలశిక్షను పట్టినట్లు, అవలీలగా తెలుగు అవగాహనమయ్యేట్టు శ్రమించిన ఏకవీరుడు.

ఈనాడు వయోజన విద్య అనేట్లు లక్షలూ కోట్లు తగలేస్తున్నారుగానీ, ఆనాడు పంతులుగారు అనాడంబరంగా తెలుగుభాషను మాట్లాడింపచేయడమే గాకుండా చదవడం, వ్రాయడం వంటి, 'విజువల్ ఎడ్యుకేషన్'కు ఆయనొక్కడే నడుముకట్టాడు. ఒక ఊరా, రెండూర్లా- తెలుగు వాళ్ళుండే ప్రాంతాలన్నీ తిరిగాడు.

'కృషితోనాస్తి దుర్భిక్షమ్' అన్నట్టు ఆనాడు నామావశిష్టంగా ఉన్న 'తెలుగు' తెలుగు వాళ్ళ నాలుకలపై లాలాజలంలా ఊరి, ఉబ్బి, ఉప్పొంగిపోయింది.

గలగలా పారింది గోదావరీ, వరదలొచ్చినప్పుడు ఊరి ఉరకలేసిందనట్టు తెలుగువారుండే తమిళనేలలో వరదలా వెల్లువలై ఎగసి ప్రవహించింది. తెలుగు అక్షరాల పంటను పండింపచేసింది.

**గలగలా గోదారి కదలిపోతుంటేను**

**బిరాబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను**

**మురిపాల ముత్యాలు దొరలుతాయి-** అని భూరేణువులన్నీ కలకలలాడాయ్. తెలుగు అక్షరాల పంటలు తమిళనాట పండాయి- అంటే ఆ ఘనత సాధు వరదరాజు పంతులుదే!

తోటివారంతా అపహాస్యం చేసారు. తెలుగు పిచ్చివాడన్నారు. ఆయన వీటివేటినీ పట్టించుకోలేదు. తమిళనాడులో కొడిగడ్తున్న తెలుగు దీపం జాజ్వలమానంగా వెలుగులీనాలంటే వరదరాజు పంతులువంటి మాతృభాషాభిమానులు మరలపుట్టాలి.

వరదరాజ పంతులుగారు తిరునల్వేలి జిల్లాలోని వీరరాఘవపురంలో సాధు రామకృష్ణయ్య పంతులు గారింట 1889 ఆగస్టు 20 తేదీన జన్మించారు. ఆయన ఎట్టియాపురం సంస్థానంలోని రాజుల వద్ద దివాన్‌గా పనిచేసారు. ఎట్టియాపురం రాజులు తెలుగువారు కావడం వలన, వారికి సాహిత్య కళాభిరుచి అమేయంగా కలవారవడం వలన- తెలుగు సాహిత్య సంగీతాలను రెండుచేతులా పోషించారు. ఆంధ్ర మహాభారతాన్ని తమిళంలో వచనరూపంలో అనువదింపచేసి ప్రచురించడానికి సహకరించారు. వారి తండ్రి రామకృష్ణయ్యపంతులుగారు సంస్థానంలో వివిధ శాఖల్లో ఉద్యోగం చేయడం కూడా వరదరాజు పంతులుగారు ఉభయభాషా సేవకెంతో ప్రయోజనం చేకూరింది. తమిళంలో అనర్గళంగా మాట్లాడడం, చదవడం, వ్రాయడం వారికి కరతలామలకమయింది. రెండు భాషలపై వున్న పట్టు రెండు భాషలల్లోనూ ప్రవీణున్ని చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో తమిళం నేర్చుకుని తమిళ శబ్దకోశాన్ని తీర్చిదిద్దారు. ఆ విశ్వవిద్యాలయంలోనే ఓ చిన్న గుమస్తాగా ప్రవేశించి మేనేజర్‌స్థాయికి ఎదిగారు. ఉద్యోగవిరమణ వరకూ ఆ పదవిలోనే ఉన్నారు.

తమిళ నిఘంటువు  కార్యాలయంలో పనిచేస్తున్నప్పటికినీ తెలుగు మీద అపారమైన వాత్సల్యం కలిగింది. తెలుగు మాట్లాడడం వచ్చినా- ఆయనకు వ్రాయడం, చదవడం రాదు; తెలుగు సాహిత్యంతో అసలు పరిచయం లేదు; అందుకాయన నిరుత్సాహపడలేదు. నిరంతర నిర్విరామకృషితో తెలుగు లిపిని చదవడం, వ్రాయడం నేర్చుకున్నారు. రోజూ ఆంధ్రదినపత్రికను చదువుతూండడం మొకటే ఆయనకు లిపి తెలిసింది. చదవడంతోబాటు, వ్రాయడం నేర్చుకున్నారు. తెలుగుశతకాలను బట్టీపట్టడం ప్రారంభించారు. కందుకూరి వీరేశలింగం రచనలు, భాస్కర రామాయణం, పోతన భాగవతం చదివే స్థాయి ఎదిగారంటే వారు అనుదినమూ ఆంధ్రపత్రికను చదివేవారు. కాశీనాథునివారు ఆంధ్రపత్రికను అచ్చు తప్పులూ, అపభ్రంశలూ లేని పత్రికగా తీర్చిదిద్దడమే వారి తెలుగు ప్రామాణికతకు కారణం, ఆంధ్ర పత్రికను దినదినమూ చదువుతూ, ఇంట్లోనివారికి ఆ పత్రిక భాషా శైలిని చెప్పేవారు.

వరదరాజు పంతులుగారి భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు శివసుబ్రహ్మణ్యం అలా నేర్చుకుని ఆంధ్రభాషలో ప్రావీణ్యతను సంపాదించారు. వారూ పంతులు గారితోబాటు తెలుగు భాషా వ్యాప్తికి బహుముఖంగా కృషి చేసారు. ఊరూరూ, గుమ్మగుమ్మమూ యెక్కి తెలుగు భాష వ్యాప్తికి విశేష కృషిచేసిన వారు వరదరాజు పంతులని యిప్పటివారికి తెలియకపోవచ్చు. తమిళనాడులో చాలా మంది తెలుగు వారున్నప్పటికినీ, వారికి తెలుగు అక్షరం చదవడం రాదు; వ్రాయడం అసలే అలవాటు లేదు.

తంజావూరులోని మహారాష్ట్రులకు తెలుగు అంటే ఎంతో ఇష్టం. తెలుగు వాక్యాలను తమ లిపిలో వ్రాయించుకుని చదివేవారు. ఆంగ్లేయులు సంస్కృతాన్ని రోమన్‌లిపిలో ముద్రించుకునేవారు. బ్రౌను వంటి తెల్లదొరలకు తెలుగు అంటే చాలా యిష్టం. తెలుగు పండితుల్ని చుట్టూ ఉంచుకుని తెలుగును నేర్చుకున్నారు. ఆయన పండితుల్ని పిలిపించుకుని వ్యాకరణమునే సంస్కరించారు.

వరదరాజు పంతులుగారి అనన్యకృషితో తమిళనాడులోని తెలుగు భాష యాసనే మరచిపోయి అచ్చతెలుగులో మాట్లాడారంటే- అది వరదరాజు పంతులు అనన్య కృషేనని చెప్పాలి. ఆయన్ను ఆనాడు దక్షిణాంధ్ర పితామహ, భాషోద్ధారక అను అనేక బిరుదములిచ్చి గౌరవించారు. 1972 సంవత్సరంలో 83 యేట ఆయన కాలధర్మం చేశారు. ఇప్పటికీ ఆయన ప్రాతఃస్మరణీయుడే! ఇలా మాతృభాషా వ్యాప్తి కోసం భుజంపై సాహితీ సారస్వాన్ని తగిలించుకుని ప్రచారం చేసిన మహోదాత్తుని పేరు నేను వినలేదు. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

044 25204046, 26171341

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com



# గాయత్రీ మంత్ర ద్రష్ట విశ్వామిత్రుడు!

## విశ్వాభ్యున్నతికి గాయత్రీ మంత్రోపదేశం చేసిన మహర్షి!

## యాగరక్షణా నిమిత్తార్థమిషగా రామలక్ష్మణులను మిథిలకు తోడ్కొని వెళ్ళి సీతారాములకూ ఊర్మిలాలక్ష్మణులకూ వివాహం జరిపించిన మహర్షి. లోక కల్యాణార్థమై సీతారాముల కల్యాణ కారకుడూ విశ్వామిత్రుడే!

సీతారామ లక్ష్మణుల వివాహంగాకుంటే ఇటు దక్షిణమునున్న లంకకూ, అటు ఉత్తరమునున్న మిథిలకూ సన్నిహితత్వం ఏర్పడేది కాదు. హనుమ సుగ్రీవుల మైత్రీ విభీషణుని కారణంగా లంక గుట్టు తెలిసేది కాదు, రావణ సంహారం జరిగేది కాదు. దండకారణ్యంలోని వేలాది రాక్షసులు సంహరింపబడేవారు కాదు. సర్వహితమూ, సర్వోత్తమమైన గాయత్రీ మంత్రం భరతవర్షానికి ప్రాప్తించేది కాదు.

### సమాజ శ్రేయస్సే గాయత్రీ మంత్రం!

వేదాలు లోకాసమస్త సుఖినోభవంతు అని ఘోషిస్తున్న విశ్వశ్రేయస్సుకు, సమసమాజ స్థాపనకు గాయత్రీమంత్రం దోహదకారి. ఒక జీవన దర్శనం. ఒక జీవించే కళ. శాస్త్రం. అవి ఒక ఆలోచనా విధానం. జీవన సరళి, సమాజ నిర్మాణానికి, విశ్వశాంతికి మూల మంత్రం. ఒక దివ్యజ్ఞానం గల గాయత్రీమంత్రం గాయత్రి దేవమాత. గాయత్రీ ఉపాసన వల్ల మనిషి మహా మనీషుడుగా మారతాడు. గాయత్రిలోని 24 అక్షరాలతో నిండి ఉంది. నీతి, ధర్మం, పవిత్ర జీవితం, కళ, సామాజిక వ్యవహారాలను గురించిన బోధ. మనిషి ఆలోచనలనూ, భావాలనూ, లక్ష్యాన్నీ, దృక్పథాన్నీ క్షాళన చేసి శారీరక, మానసిక క్రియలలో సత్వగుణమూ, ధర్మ నిష్ఠా పెంపొందుతాయి. గాయత్రిలోని అక్షరాలు చేసే మహాబోధలను అనుసరిస్తే ఈ ప్రక్రియ అమలు జరుగుతుంది. కనుకనే గాయత్రి వేద శాస్త్రాల సారం.

### ఓం

ప్రకృతి అంతరాళంలో 'ఓం' వంటి ధ్వని ప్రతిక్షణం ఉత్పన్నం అవుతోంది. ఈ పరమేశ్వర నామాన్ని సూక్ష్మ ప్రకృతి ప్రతి క్షణం జపిస్తోంది. నినదిస్తోంది. కనుక ఈ నామం, స్వయం వ్యక్తం, సర్వశ్రేష్ఠం అయినది. సత్వగుణాన్నీ, దైవీయ, ఈశ్వరీయ పారమార్థిక భావనలనూ హృదయంలో నింపుకోవడం. తామసంతో, అసురత్వంతో, భోగవాదంతో, స్వార్థంతో కూడిన వాసనలలో మునిగిపోవడం ఉండదు.

ఓంలో అ ఉ మ్ అనే మూడు అక్షరాలు కలసి ఉన్నాయి. 'అ' అంటే ఆత్మపరాయణత్వం; మనస్సును శారీరిక విషయాల నుండి తప్పించి, ఆత్మానందంలో ఓలలాడడం. 'ఉ' అంటే ఉన్నతి. శారీరిక, మానసిక, సామాజిక, ఆర్థిక, ఆత్మిక సంపదలతో మనల్ని నింపుకోవడం. 'మ్' అంటే అర్థం– గోప్యతనం, క్షుద్రతనూ, సంకుచితత్వాన్నీ, స్వార్థపరత్వాన్నీ, ఇంద్రియ చాపల్యాన్నీ వదులుకోవడం ప్రేమ, దయ, ఉదారత, సేవ, త్యాగం, ఆదర్శాలు, సంయమనం ఆధారంగా జీవితాన్ని నిర్మించుకోవడం.

### భూః

మనం శరీరాలం కాము–ప్రాణ మూలం, ఆత్మలం. శరీరానికి ప్రధాన్యాన్ని ఇస్తూ ఆత్మను ఉపేక్షించడం భౌతిక వాదం. మనం ఆత్మలమనీ, కనుక మన శ్రేయస్సు ఆత్మపరాయణత్వంలో ఉన్నదనీ గాయత్రి చెబుతుంది. మనం ఆత్మవాదులం కావాలి. ఆత్మ కల్యాణానికీ, ఆత్మచింతనకూ, ఆత్మోన్నతకీ, ఆత్మగౌరవానికీ అగ్రప్రాధానయం ఇవ్వాలి. వాటికోసం కృషిచేయాలి. సమాజ సేవద్వారా విరాట్ పురుషుడూ, విశ్వమానవుడూ అయిన పరమాత్మను ఆరాధించాలి.

భువః అక్షరం మనకు కర్మయోగ సందేశాన్ని ఇస్తోంది. కర్మయోగం ఆధారంగానే మనం అన్ని రకాల దుఃఖాలనుండీ విడుదల పొందగలుగుతాం. సత్ఫలితాలను సాధించాలంటే మన జీవనం వికాసం పొందాలంటే చేయవలసిన పనిలో మనం పూర్తిగాద నిమగ్నం కావాలి. ఇలా నిర్ణయించుకోవడంలోనే బుద్ధికుశలత, దూర దృష్టి వివేకం ఇమిడి ఉన్నాయి. మనం మన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉన్నప్పుడు వైఫల్యానికి క్రుంగిపోవడంలో, సాఫల్యానికి పొంగిపోవడంలో అర్థం లేదు. ఫలితాన్ని ఇచ్చేశక్తి వేరొకటి. మనం మన కర్తవ్యాన్ని పూర్తిచేయాలి. ఈ భావనయే అనాసక్త యోగం. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటాడు. దుఃఖంలో కష్టంలో విచారించవలసిందేమీ అతడికి కనిపించదు.

స్వః మనస్సును నీలోపల స్థిరంగా ఉంచుకో. నీవు దృఢమైన మనస్సుతో వుండు. సంఘటలనూ, పరిస్థితులనూ నీటి అలలుగా పరిగణించు. వాటితో ఆడుకుని ఆనందించు. అనుకూల పరిస్థితులలోని స్వారస్యాన్నీ, ప్రతికూల పరిస్థితులలోని స్వారస్యాన్నీ ఆస్వాదించు. వాటివల్ల ఉద్విగ్నుడవు కావద్దు, అస్థిరుడవు కావద్దు, సమతూకాన్ని కోల్పోవద్దు. సంతోష దుఃఖాల ఈ బాల్య క్రీడలలో మనం మునిగిపోకూడదు. మనం ఆత్మపరాయణులం కావాలి. 'స్వః'ను తెలుసుకోవాలి.


*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*

**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

ఆత్మచింతనలో, ఆత్మ విశ్వాసంలో, ఆత్మ గౌరవంలో, ఆత్మ నిష్ఠలో, ఆత్మ సాధనలో, ఆత్మోన్నతిలో, ఆత్మ నిర్మాణంలో మనం మన ఇచ్ఛా శక్తినీ, ఊహాశక్తినీ, క్రియాశక్తినీ వినియోగించాలి. ఎందుకంటే– లోపలి మూల కేంద్రం, జన్మస్థలి ఆత్మయే. ఆత్మ–స్థితుడయిన మనిషి అంతరంగం ఆరోగ్యకరంగా ఉంటుంది. కనుక అతడు సదా సంతోషంగా ఉంటాడు.

### తత్

జీవన, మరణాల రహస్యాన్ని తెలుసుకో. భయం, ఆసక్తీ లేకుండా జీవించు. వాస్తవికత అనే గట్టి ఆధారంగా నీ కార్యకలాపాలను రూపుదిద్దుకో. జీవితంలోని క్షణాలను సద్వినియోగపరచుకుంటే, ఆత్మలాభం అనే నిజమైన ప్రయోజనం కోసం వాటిని ఉపయోగిస్తే– నేడో రేపో మృత్యువు ఎదురైనపుడు మనం దుఃఖించ వలసిన అవసరం ఉండదు.

### సవితుః

సూర్యునివలె తేజస్విగా మారు. సప్త బలాల్నూ నీ జీవిత రథానికి కట్టివేయి. మన అదృష్టానికీ, మన పరిస్థితులకూ నిర్మాతలం మనమే. మన సామర్థ్యం ఆధారంగా మన ప్రతి ఇచ్ఛనూ, ప్రతి అవసరాన్నీ పూర్తి చేసుకునే బలం మనకు పూర్తిగా ఉంది. శరీర బలం, బుద్ధి బలం, విద్యాబలం, ధన బలం, సంఘటనా బలం, శీలబలం, ఆత్మబలం– ఈ ఏడూ జీవితంలో వెలుగునూ, ప్రతిష్ఠనూ, సంపదనూ, స్థిరత్వాన్నీ నింపడానికి అవసరం అవుతాయి.

### వరేణ్యమ్

మనం దురాలోచనను వదిలి సదాలోచనను స్వీకరించాలి. అమంగళకరమైన ఆలోచనను వదిలి, మంగళకరమైన ఆలోచనను స్వీకరించాలి. అందువల్ల మనస్తాపం, అసంతృప్తి అంతమవుతాయి. అంతటా అన్ని పరిస్థితులలో ఆనందం తాండవిస్తుంది. ఒక మనిషి ఆంతరిక ఉన్నతియే అతడి శ్రేష్ఠత్వానికి కారణం అవుతుంది. మనం గొప్పవాళ్లం కావాలి. శ్రేష్ఠులం కావాలి, సంపన్నులం కావాలి. అయితే భౌతిక వస్తువు కాక, ఆంతరంగిక పరిస్థితి వాటికి పునాది కావాలి.

### భర్గో

మనుషులు పాపరహితులు కావాలి; పాపాల పట్ల మెలకువ వహించాలి; పాపాల వల్ల కలిగే దుష్ఫలితాలను గుర్తించి వాటిని ఏవగించుకోవాలి; వాటిని నాశనం చేయడానికై నిరంతరం సంఘర్షణ జరుపుతూ ఉండాలి. పవిత్రత కోసమై మన కృషి కొనసాగితే ప్రపంచంలోని కష్టాలనుండీ, భవ బంధనాలనుండీ విముక్తి పొంది, మనం జీవన్ముక్తునిలో ఉండే స్వర్గమయ ఆనందాన్ని చూరగొనగలుగుతాం.

### దేవస్య

మలినమైన దృక్పథాన్ని వదిలి, విశుద్ధమైన ఆలోచనా విధానాన్ని అవలంబించాలి. అసురత్వపు విధానాన్ని వదిలి, దేవత్వపు కార్యకలాపాలను చేపట్టాలి. భవిష్యత్తులో దుఃఖాన్ని కలిగించే ఆత్మను పతనం చెందించే క్షణిక సుఖాలకూ, ఆకర్షణలకూ, ప్రలోభాలకూ దూరంగా ఉండాలి. మనం దేవతత్వాన్ని వికసింపజేసుకోవాలనీ, దేవత్వాన్ని ప్రోత్సహించాలనీ, దైవీకమైన ఆత్మ సంకేతాలను అనుసరించాలనీ గాయత్రి బోధిస్తుంది.

కృతజ్ఞతలు **– ఎ.సుబ్బారావు**


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**


# నమస్కారం భారతీయ సంస్కారం!

నమస్కారం భారతీయ సంస్కారం! ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నప్పుడు నమస్కరించటం భారతీయ సంప్రదాయం

ఒకరినొకరు అభివాదం చేసుకునే పద్ధతి, పలకరించుకునే పద్ధతి ఒక్కొక్క జాతిలో ఒక్కొక్క విధంగా ఉంటాయి. అవి వారి వారి సంస్కృతీసంప్రదాయాల పైన నాగరికత పైన ఆధారపడి ఉంటాయి.

కరచాలనం, ఒక చేయి నుదిటి పై అడ్డంగా చేర్చటం (salute), చేతి పైనో చెక్కిలి పైనో మృదువుగా ముద్దులు పెట్టటం, ప్రేమతో ఆలింగనం చేసుకోవటం, వంగి సలాం చేయటం, ఇలా ఎన్నో పద్ధతులు.

అయితే ఈ పలకరింపులో కూడా భారతీయులది ఒక ప్రత్యేక శైలి. మన పలకరింపు శా%స్త్రీయతతో మేళవించిన సంప్రదాయం.

పెద్దలని చూడగానే చిన్నవారు (వయసులో, అధికారంలో, జ్ఞానంలో, ధనంలో, ఎందులోనైనా సరే) చేతులు జోడించి నమస్కరించటం భారతీయులందరు చేసే పని.

నమ అంటే వంగి ఉండటం అని అర్థం.

అంటే పెద్దల ఎదుట అహంకరించకుండా అణిగిమణిగి ఉండటం.

నాది అనేది లేనిది అనే అర్థం కూడా చెపుతారు 'నమ' అనే పదానికి. అంటే ఎదుటి వారికి తనను తాను సమర్పించుకోవటమన్నమాట.

'ఎందుకు నమస్కరించాలి? నోటితో 'హాయ్' అనో 'హలో' అనో అంటే సరిపోతుంది కదా!' అనే సందేహం కలగవచ్చు.

దానికి సమాధానం తెలుసుకోవాలి. మానవ శరీరం ఒక విద్యుదయస్కాంత ఘటం. ధన, ఋణ ధృవాలు కలిస్తే విద్యుత్ ప్రవాహ మార్గం (సర్క్యూట్) పూర్తి అవుతుంది.

మనిషి శరీరంలో అటువంటి ధృవాలు చేతి వ్రేళ్ళు. వాటిని కలపటం వల్ల సర్క్యూట్ పూర్తి అవుతుంది.

విద్యుదయస్కాంత ఘటంలో విద్యుత్ చలనం మొదలవుతుంది. రెండు ఘటాలు దగ్గరైనప్పుడు ఒకదాని ప్రభావం మరొక దానిమీద ఉంటుంది. ఎక్కువ శక్తివంతమైన ఘటం సమక్షంలో తక్కువ శక్తివంతమైన ఘటంలో ప్రకంపనలు కలుగుతాయి. అవి సరిగా మేలు కలిగించే విధంగా ఉండటానికి చేసిన ఏర్పాటు ఈ నమస్కారం.

నమస్కరించటంలో కూడా ఎదుటివారిని బట్టి పద్ధతి మారుతుంది.

దేవతలకు రెండు చేతులు సహస్రారంపై జోడించాలి.

పెద్దలకు నుదుటిపై అంజలి ఘటించాలి.

సాటి వారికి అభివాదం చేయటానికి రెండు చేతులను హృదయ స్థానంలో జోడించాలి.

తల్లి, తండ్రి, గురువు, దైవం, ఆ స్థాయిలో గౌరవించ దగిన వారింకెవరైనా వారికి సాష్టాంగ నమస్కారం చేయటం మన అలవాటు.

దీనినే దండప్రణామమ్ అని కూడా అంటారు. అంటే, కర్ర లాగా నేలమీద పడి, ఎనిమిది అవయవాలు భూమిని తగిలేట్టుగా నమస్కరించటం.జ

స్త్రీలు పంచాంగాలతో చేస్తే సరి పోతుంది. స్త్రీల ఉదరం, వక్షస్థలం మనిషి అస్తిత్వానికి, పోషణకి నిలయాలు కనుక అవి నేలకు తగులరాదు. దీనికే ప్రణిపాతం అని పేరు. అత్యుత్కృష్ట గౌరవాన్ని ప్రదర్శించటానికిది సంకేతం.

నిజానికి ఇలా చేయటం వల్ల నమస్కరించిన వ్యక్తికి ఎదుటివారి నుండి శక్తి ప్రసారం జరుగుతుంది.

అందుకే ఎప్పుడూ తమకన్న ఏదో విధంగా అధికులైతేనే నమస్కరించాలి. తక్కువ స్థాయిలో ఉన్న వారికి ఎక్కువ స్థాయిలో ఉన్నవారు నమస్కరిస్తే ఆయు క్షీణమని పెద్దలు చెపుతారు.

తక్కువ శక్తి ఉన్నది ఎక్కువ శక్తి ఉన్న దానికి ఇవ్వటం వల్ల అల్లకల్లోలమే కదా!


నమస్కరించటాన్ని మొక్కటం, ప్రణామం చేయటం, దండం లేక దణ్ణమ్ పెట్టటం అని కూడా అంటారు.

కాళ్ల మీద పడి పోవటాన్ని ప్రణిపాతం చేయటం అంటారు.

ఇది పరిపూర్ణ శరణాగతిని తెలియజేస్తుంది.

భారతీయులు అభివాదం చేసే పద్ధతి చాలా శాస్త్రీయ మైనదని, శ్రేయోదాయకమని అందరూ అంగీకరించిన విషయం. కాబట్టి ఇక నుంచి మన పలకరింపు మన సంప్రదాయానికి అనుగుణంగా ఉండేలా చూడండి. ఆ సంప్రదాయం ముందు తరాలకి కూడా చేరేలా చూడండి.

**లోకా సమస్తా సుఖినోభవన్తు!**



# ఎవరైతే సేవ చేయగలరో వారే (హీరోలు) నాయకులు

- స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

## పునిత్ పునీతుడు



పునిత్ రాజ్‌కుమార్ పునీతుడు. అందుకే దేవుడు తన దగ్గరకు తీసుకున్నాడేమో, ఇలా అనడం కరెక్ట్ కాదేమో, అవును అంటే మంచివాళ్ళు వెళ్ళిపోతూ వుంటే ఆ దేవునిపై కోపం, వున్నాడా, లేడా అనే ప్రశ్నలు ఉదయమవుతూ వుంటాయి. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కుటుంబమంతా కర్ణాటక ప్రజలకు వారు దైవస్వరూపులు. అలాగే వారు ఏ వివాదాలలోనూ చోటు చేసుకో లేదు. ఇది తెలుసుకొని వీరప్పన్ రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసాడు, తద్వారా తన కోరికలన్నీ నెరవేర్చుకో వచ్చునని ఎత్తు వేశాడు. కానీ ఆయన మంచితనం ముందు తల ఒగ్గి తిరిగి భద్రంగా అప్పజెప్పేశాడు. ఆయన ముగ్గురు కుమారులలో పునీత్‌రాజ్ కుమార్ మూడవవాడు. కర్ణాటక సూపర్‌స్టార్. తన స్టార్‌డమ్‌లో ఆకట్టుకోవటమే కాకుండా మంచి పనులలోను యావత్ భారతదేశ ప్రజల దృష్టిని ఆకర్షించాడు. సినిమా తారలంటే పెద్ద బంగళాలు, సరికొత్త కారులు, క్రికెట్ మ్యాచ్‌లు, స్టేజి షోలు ఇలాగే మనకు గుర్తొస్తారు. కాని 46 సంవత్సరాల వయస్సులో తన మంచితనంతో పలు సేవా కార్యక్రమాలలో ప్రజల గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి పునీత్. తండ్రిలాగే బహు ముఖ్య ప్రజ్ఞావంతుడు. రాజ్‌కుమార్ సినిమా సంగీతంలోను, అటు భక్తి సంగీతంలోను తనదైన బాణీని ఏర్పరిచినట్టు ఇతగాడు సంగీతపరంగా చాలా పాటలను పాడి జనులను రంజింప చేసాడు. ఊహించని అతని మరణం యావత్ భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మొత్తం సినిమా పరిశ్రమ ఆ షాక్ నుండి తేరుకోలేక పోయింది. ప్రతి నటుడు చిన్నా పెద్దా పునీత్ మరణం పట్ల తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఒక్కొక్కరు అతని మంచితనం గురించి చెపుతూ ఉంటే అయ్యో భగవంతుడా అంత మంచివాడిని అప్పుడే తీసుకువెళ్ళిపోయావా అనిపించింది. 45 స్కూళ్ళు, 16 వృద్ధాశ్రమాలు, 26 అనాథా శ్రమాలు, 1800 విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఫీజు కట్టడం సామాన్యమైన విషయమా. డబ్బున్నా చెయ్యడానికి మనసుండక్కర్లేదు. తన మరణానంతరం తన కళ్ళను దానమిచ్చిన మహనీయుడు. మంచి ఉద్దేశంతో చేశాడు కాబట్టే అతని రెండు కళ్ళు నలుగురికి చూపునిచ్చాయి. ఇది మెడికల్ మిరాకిల్ అంటూ ఆ డాక్టర్ చెప్పడం నేనే టీవీలో చూశాను. మరణానంతరం మన కళ్ళు మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తాయనే ఆనందాన్ని పొందాలి. పునీత్ విషయంలో ఆ కళ్ళు నలుగురికి ఉపయోగపడ్డాయి. తనను కన్నడంలో అప్పు అనీ, పవర్ స్టార్ అని పిలుచుకునే వాళ్ళు. చాలామంది స్టార్లలో తనూ ఒకడు. పైగా ఓ లెజెండ్ వారసుడు.



అన్నలిద్దరూ నటులే, ఇండస్ట్రీలోనే ఉన్నారు.

పునీత్‌కూ ఫ్యాన్స్ ఉన్నారు, కానీ ఎప్పుడూ వాళ్లు మూర్ఖాభిమానులుగా ఉన్నాడంతో వ్యవహరించినట్టు కనిపించలేదు.

అక్కడక్కడా పలువురు అభిమానులు చనిపోతున్నారనే సమాచారం వచ్చినప్పుడు పునీత్ భార్య అణకువగా ఓ ప్రకటన జారీ చేసింది.

"పునీత్ దూరమైన బాధలో ఉన్నాం మేం. మీరూ దూరమై మీ కుటుంబాలను బాధలో పడేయకండి, అది మాకూ బాధే".

అదీ ఫ్యాన్స్ పట్ల కనబరిచే సహానుభూతి.

అసలు తన భౌతికదేహాన్ని చూడటానికి వచ్చిన లక్షల మందిని చూసి ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఆశ్చర్యపోయారు.

ఒక సినిమా నటుడికి ఎవరికీ దక్కనంత ఘనమైన నివాళి. అంత మంది వచ్చినా సరే ఎక్కడా చిన్న అలజడి లేదు, మర్యాదగా, పద్ధతిగా చెప్పులు విడిచి, అంతిమ నివాళి అర్పించి క్రమశిక్షణతో వెళ్లిపోయారు.

వాళ్ల అభిమానులు అంటే అదీ అభిమానం అంటే గ్రేట్.

మరణం తరువాత పదకొండోరోజు సాధారణంగా దశదినకర్మ రోజు దగ్గరివాళ్లను, బంధువులను, స్నేహితులను పిలుస్తాం. ఆయా కులాల్లో ఆనవాయితీని బట్టి మందు, నాన్ వెజ్ కూడా ఘనంగా ఏర్పాటు చేసి, తమ స్థోమతను బట్టి కర్మ నిర్వహిస్తుంటారు.

పునీత్ కుటుంబం ఫ్యాన్స్‌ను కూడా బంధువుల జాబితాలో పరిగణించారు. అందరినీ రమ్మన్నారు.

భోజనాల ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి కుటుంబం కదా, అన్నలిద్దరూ విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.

పదకొండు, పన్నెండు గంటలకు మొదలైన భోజనాలు 4-5 గంటల వరకూ.

ఫ్యాన్సే కదా అని తేలికగా చూడలేదు.

టేబుళ్ల మీద, అరిటాకులు వేసి, పద్ధతిగా పెట్టారు, ఎవరొస్తే వాళ్లకు.

రాష్ట్రంలో దూరప్రాంతాల నుంచి కూడా వచ్చి పునీత్ పట్ల తమ ప్రేమను చాటుకున్నారు వేల మంది.

బెంగుళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 50 వేల మంది 'ప్రసాదం' స్వీకరించారు.

ఇంతమందికి భోజనాల ఏర్పాట్లు అంటే మాటలా..? ఖర్చు సరే... కానీ ఆ ప్రయాస, సరిపడా ప్లానింగ్, ఎవరికీ అసంతృప్తి కలగకుండా చూడటం. పెద్ద టాస్క్.

ఏదో వచ్చారు కదాని అల్లాటప్పాగా గుళ్లలో అన్నదానం తరహాలో చేయలేదు.

రెండుమూడు టీవీలు చూస్తుంటే కాస్త అర్థమైంది. సోనామశూరి సన్నన్నం, కోడిగుడ్లు, చికెన్ గట్రా. పెళ్లిళ్లలో పెట్టినట్టే తృప్తిగా పెట్టారు.

పునీత్ భార్య, ఇద్దరు సోదరులు కూడా వచ్చి అందరినీ పలకరించి వెళ్లారు.

'చాలామందిఎంతో దూరం నుంచి వచ్చారు, అందరూ మా హృదయాలకు దగ్గరే అన్నాడు పునీత్ సోదరుడు రాఘవేంద్ర.

'వీళ్లు లేక మా ఉన్నతి ఎక్కడిది..? వీళ్ల పట్ల కృతజ్ఞులుగా ఉండటమే మేం చేయగలిగేది' అన్నాడు శివ రాజకుమార్.

ఇక్కడా అంతే.

ఒక దశలో రెండు కిలోమీటర్ల దాకా క్యూ. కానీ పద్ధతి తప్పలేదు ఎవరూ క్రమశిక్షణతో కదలడం, ఓ హాలులో ఉన్న పునీత్ చిత్రపటానికి దండం పెట్టడం, ఖాళీ ఉన్న కుర్చీల్లో కూర్చోవడం, తినడం, వెళ్లిపోవడం.

ఫ్యాన్స్ మా కుటుంబసభ్యులు, మా బంధువులు అని సొల్లు కబుర్లు చెప్పే సినిమా కుటుంబాలు బోలెడు.

కానీ రాజకుమార్ కుటుంబం ఆ స్పిరిట్‌ను చేతల్లో చూపించారు. ఇక్కడ ఖర్చు ఎంతనేది కాదు, ఎంతమంది ఫ్యాన్స్ వచ్చారు అనేది కాదు.

నిజంగానే అభిమానుల్ని తమ కుటుంబసభ్యుల్లాగే పరిగణించిన తీరు విశేషం అనిపించింది!!

పునీత్ మంచిగా బతకడమే కాదు, గొప్పగా వెళ్లిపోయాడు!! అందుకే పునీత్ మనసున్న పునీతుడు. ఎక్కడో నూటికో కోటికో ఒకరుంటారు. ఆ ఒక్కడు ఇలా వెళ్ళిపోవడం చాలా బాధ కలిగించింది.

❊ ❊ ❊

నైతిక విలువలు ఈ పదం ప్రతి టి.వి. ఛానల్‌లోను వినే వుంటారు. ప్రతి దినపత్రికలో ఏదో ఒక రాజకీయ నాయకుడు దాని అర్థం తెలియకుండానే వాడే మాట. రోజూ కనీసం పదిసార్లయినా ఈ పదం వినకుండానో, చూడకుండానో (పేపర్లలో, టి.వి.లలోను) వుండరు. అసలు దీని అర్థం ఏమిటి?

**ధర్మో విశేషో అధికో నరాణమ్**

**ధర్మేణ హీనాః పశుభిః సమానాః**

నైతిక విలువలు మానవులకు జంతువుల నుంచి నేర్పుతాయి. అవి లేని మానవులు పశువులే! అని సంస్కృతంలో ఒక సామెత వుంది.

ఈనాటి రాజకీయాలు రాజకీయ నాయకులు నైతిక విలువలకు తిలోదకాలిచ్చేసారు. ఈమధ్య రాజకీయ వార్తలూ ఇలాగే వున్నాయి. దేశ రాజకీయాలకు ఏమాత్రం తీసిపోనివిగా రాష్ట్ర రాజకీయాలు వున్నాయి. ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా వున్నారు. వీరి మధ్యలో ప్రజలు, నానా అవస్థలకు గురియవుతూ నలిగిపోతున్నారు. ఈ నాయకులు ఒకరినొకరు ద్వేషించడం వలన వారి మనసులు సంకుచితం అయ్యి ఆలోచనాశక్తి, వివేచనాశక్తి కుంటుపడుతోంది. ద్వేషంతో, కలవరంతో క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ద్వేషించేవాడి ఒత్తిడి, ఆందోళనలవల్ల ద్వేషింపబడేవాడి మదిలో అసహాయత చోటుచేసుకొని నిస్పృహతో వారి నోటినుండి అనాలోచితంగా మాటలు జారుతాయి. అయినా మన దేశంలో ఎన్నుకోబడిన నాయకులకు సమాధానం చెప్పే ఓపిక, తీరిక లేదు. ప్రతిపక్షం నాయకులకు పదవి లేకుండా అయిదు సంవత్సరాలు ఓపిక పట్టే ధోరణి లేదు. ప్రతి తప్పును భూతద్దంలో చూడడం దానిని మీడియా వారు చిలవలు పలవులతో నానా రాద్ధాంతం చేయడం పరిపాటి అయ్యింది. మన సినిమాలలో ప్రతి హీరో డ్యూటీలో వున్న పోలీసు అధికారి (సినిమాలలో అనుకోండి) చితకబాదినవాడే. వీటిని మనం ఖండించలేదు. వారికి సన్మానాలు చేసాం, అవార్డులు ఇచ్చాం, వారిని దేవుళ్ళు, దేవతలుగా పూజిస్తున్నాము. వీటన్నిటినీ అడిగే నాయకుడు లేడు. దేశభక్తిగల నాయకులు అసలు లేరు. ఎవరు ఎన్ని ఓట్లు సంపాదిస్తారో ఆయనే పెద్దనాయకుడు, ఘరానా నాయకులు. వారిపై ఎన్ని కేసులువున్నా ఫరవాలేదు. వారు ఎంత నీచంగా ప్రవర్తించినా ఫరవాలేదు. కాబట్టి నాయకులందరూ సమన్వయం పాటించి ప్రజల సమస్యలను పట్టించుకొని అవి సాధించడంలో వారి హీరోయిజం చూపితే బాగుంటుంది. ●

# ప్రముఖాంధ్ర అభిమానులకు వినతి!

ప్రముఖాంధ్ర గత 27 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. "ప్రముఖాంధ్ర" ప్రగతిని కాంక్షిస్తూ కొందరు శ్రేయోభిలాషులు, గోటేటి శ్రీరామారావు అభిమానులు, ఎన్నో అవాంతరాలను ఎదుర్కుంటూ, నెలనెలా క్రమం తప్పకుండా పత్రికను తీసుకువస్తున్నందుకు అభినందిస్తున్నారు.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**

**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**

**మొబైల్ : 98400 48941**

## కాళ్లకు చెప్పులు లేకుండా పద్మశ్రీ అవార్డు అందుకునేందుకు వచ్చిన తులసి గౌడ..



రాష్ట్రపతి భవన్‌లోని పద్మ అవార్డుల ప్రదానోత్సవం సమయంలో తులసి గౌడ అని పేరు పిలవగానే.. సంప్రదాయ దుస్తుల్లో, కాళ్లకు చెప్పులు కూడా లేని ఓ 76ఏళ్ల మహిళ నడుచుకుంటూ వస్తుంటే.. దర్బార్ హాల్‌లోని కళ్లన్నీ ఆమెవైపు ఆశ్చర్యంగా, ఆనందంగా చూశాయి.

సాధారణంగా రాణులు కోటలు కడతారు.. కానీ కర్ణాటకకు చెందిన ఈ మనసున్న మారాణి తులసి మాత్రం ప్రత్యేకమైన కోటను నిర్మించింది. ఏకంగా 40 వేల వృక్షాలతో వనసామ్రాజ్యాన్నే సృష్టించింది. గత ఆరు దశాబ్దాలుగా పర్యావరణానికి ఆమె చేసిన ఈ సేవే.. పద్మశ్రీ అవార్డును తెచ్చిపెట్టింది. కర్ణాటకలోని అంకోలా తాలూకా హొన్నాలి గ్రామానికి చెందిన తులసి గౌడ.. హలక్కీ గిరిజన కుటుంబంలో జన్మించారు. ఆమెకు రెండేళ్ల వయసులోనే తండ్రి మరణించారు. దీంతో పూట గడవడానికి రోజూ తల్లితో కలిసి కూలీకి వెళ్లేది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదువుకు దూరమవడంతో తులసికి చదవడం, రాయడం రాదు.

10–12 ఏళ్ల వయసులోనే గోవింద గౌడ అనే వ్యక్తితో ఆమెకు పెళ్లి చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆమె భర్త మరణించాడు. ఆమె మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం చూసి అటవీ శాఖ అధికారులు ఆమెను తాత్కాలిక ఉద్యోగిగా నియమించుకున్నారు. కొన్నాళ్లకు ఆమెను శాశ్వత ఉద్యోగిగా నియమించారు. ఇలా పద్నాలుగేళ్ల పాటు అటవీశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అరవై ఏళ్లలో తులసి నలభై వేలకు పైగా మొక్కలు నాటి వాటిని పెంచారు.

తులసి చదువుకోలేదు గానీ ఆమెకు చెట్ల గురించి ఎన్నో విషయాలు తెలుసు. దాని జీవితకాలం.. ఔషధ గుణాలు.. ఏది అడిగినా చటుక్కున చెప్పేస్తారు. శాస్త్రవేత్తలు కూడా అబ్బురపడేంత వృక్ష విజ్ఞానం ఆమె సొంతం. 76ఏళ్ల వయసులోనూ తులసి ఏ మాత్రం అలసట చెందకుండా మొక్కలు నాటుతారు. నీళ్లు పోసి కన్నబిడ్డలా వాటిని పెంచుతారు. తనకొచ్చే పింఛను డబ్బులన్నింటినీ దీనికే ఖర్చు చేస్తున్నారు.

## వీధుల్లో పండ్లు అమ్ముకునే వ్యక్తిని వరించిన పద్మశ్రీ అవార్డు



**మంగళూరు సమీపంలోని హరెకాళలి అనే గ్రామానికి చెందిన 65 ఏళ్ళ హాజప్ప అనే వ్యక్తి ప్రతిరోజూ తన గ్రామం నుంచి బత్తాయి పండ్లను తెచ్చి మంగళూరులో అమ్ముకుని తిరిగి సాయంకాలానికి ఇళ్ళు చేరుతారు..**

**ఈవిధంగా ఆయన గత 55 ఏళ్ళుగా చేస్తున్నారు. అంటే తన 10వ ఏట నుండి ఆయన ఇలా పండ్లు అమ్ముతున్నారు..**

**ఇంత అనుభవం ఉండడంతో ఆయన పండ్ల వ్యాపారంలో తనకు వచ్చే ఆదాయాన్ని వెచ్చించి వారి గ్రామంలో ఒక పాఠశాల నిర్మించి, ఉపాధ్యాయులను కూడా తన ఖర్చుతోనే ఏర్పాటుచేసి పేద పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు..**

**ఎందుకంటే తనకు చదువుకోవాలని కోరిక ఉన్నా పేదరికం కారణంగా చదువుకోలేకపోయాడు. పేదరికం కారణంగా 10వ ఏట నుంచే ఆయన పండ్లు అమ్మి కుటుంబాన్ని పోషించవలసి వచ్చింది. తనలాగా పేదవాళ్ళు చదువులేనివారిగా మిగిలిపోకూడదని ఆయన సంపాదించినదంతా స్కూలు కోసం ఖర్చుపెడుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ2020 అవార్డు ప్రకటించింది.. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన పద్మ అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన తన అవార్డును అందుకున్నారు..**

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**Posted at Egmore / RMS Pathrika Channal, posted between 5 - 8, November 2021**




**The One Stop solution for all your Printing Needs**

**GOTETI GRAPHICS**

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA
✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***